


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 13-06-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 238 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# కొలువుదీరిన కొత్త సభ

- ఏపీ అసెంబ్లీ సమావేశాలు
- కొలువుదీరిన 15వ శాసనసభ
- ప్రజల భవితకు భరోసా
- రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయం
- తొలిసారిగా సీఎం హోదాలో జగన్
- ప్రొటెం స్పీకర్‌గా శంబంగి
- జగన్, చంద్రబాబు నాయుడు, మంత్రులు ప్రమాణం




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నూతన శకానికి తెరతీసిన 15వ శాసనసభ కొలువుదీరింది. ముందుగా నిర్ణయించిన ముహూర్తం ప్రకారం బుధవారం ఉదయం 11.05 గంటలకు 15వ శాసనసభ తొలి సమావేశం ప్రారంభమైంది. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన శంబంగి చిన వెంకట అప్పలనాయుడు సభాపతి స్థానంలో ఆసీనులయ్యారు. జాతీయ గీతంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

అనంతరం ముఖ్యమంత్రి, సభానాయకుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొదట శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి, విపక్ష నేత చంద్రబాబునాయుడు ప్రమాణం చేశారు. అనంతరం మంత్రులు ప్రమాణం చేశారు. అనంతరం అక్షర క్రమంలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మినహా మొత్తం 173మంది సభ్యులు ఎమ్మెల్యేగా ప్రమాణం స్వీకరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తప్పుగా ప్రమాణం చేశారని ప్రొటెం స్పీకర్ చిన అప్పలనాయుడు తెలుపడంతో ఆయన మరోసారి శాసనసభ సభ్యుడిగా దైవసాక్షిగా ప్రమాణం చేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రమాణం అనంతరం అసెంబ్లీ గురువారం ఉదయం 9 గంటలకు వాయిదా పడింది.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడినైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనే అంటూ.. దైవసాక్షిగా ఆయన ప్రమాణం చేశారు. అనంతరం ప్రొటెం స్పీకర్ అప్పలనాయుడిని మర్యాదపూరకంగా కలిసి.. అభివాదం చేశారు. రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ఆ తర్వాత ఎన్ చంద్రబాబునాయుడు అనే నేను.. టీడీపీ అధినేత చంద్రబాబు దైవసాక్షిగా ప్రమాణం చేశారు.

**సీఎం హోదాలో తొలిసారి అసెంబ్లీకి వైఎస్ జగన్..**

ఆంధ్రప్రదేశ్ 15వ శాసనసభ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి చేరుకున్నారు. అసెంబ్లీ ద్వారం వద్ద సీఎం వైఎస్ జగన్‌కు పూర్ణకుంభంతో వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి శాసనసభలో బుధవారం అడుగుపెట్టారు. అద్వితీయమైన ప్రజాదరణ ఉన్న నేత సభా తరువాయి 2లో..

## అసెంబ్లీకి రావడం ఆనందంగా ఉంది



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా, తాము ఎమ్మెల్యేలుగా 15వ అసెంబ్లీలో అడుగుపెట్టబోతుండటం ఎంతో ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. దేశమంతటికీ ఆదర్శంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- 2100 మంది రైతుల బాకీ తీర్చా
- బిగ్ బీ అమితాబ్



బీహార్: బిగ్ బీ అమితాబ్ బచ్చన్ మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. రైతు సమస్యలపై స్పందిస్తూ.. వారికి అండగా ఉండే ఈ బిగ్ బీ అమితాబ్ పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారన్న సంగతి తెలిసిందే. తాజాగా బిహార్‌లో ఏకంగా 2100 మంది రైతుల రుణాలు తీర్చి రైతు బాంధవుడిగా తరువాయి 2లో..

## నేడు ఏపీ నూతన శాసనసభాపతి ఎన్నిక

అమరావతి: గురువారం ఆంధ్రప్రదేశ్ నూతన శాసనసభాపతిని ఎన్నుకుంటామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. శాసనసభాపతి పదవి కోసం ఇప్పటి వరకు ఒకే నామినేషన్ వచ్చిందని వెల్లడించారు. 30 మంది ఎమ్మెల్యేలు తమ్మినేని అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించగా, జగన్ నిర్ణయించారని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ్మినేని సీతారాం.. 3 సార్లు మంత్రిగా, 6సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారని చెప్పుకొచ్చారు.

## అనంత్‌నాగ్‌లో ఉగ్రదాడి

శ్రీనగర్: ఉగ్రవాదులు మరోసారి దొంగదెబ్బ తీశారు. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో కేపీ రోడ్డు వద్ద సీఆర్‌పీఎఫ్ గస్తీ బృందంపై బుధవారం సాయంత్రం దాడికి దిగారు. ఆటోమేటిక్ రైఫిల్స్‌తో కాల్పులు జరపుతూ, గ్రనేడ్లు విసిరారు. ఈ కాల్పుల్లో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన అనంత్‌నాగ్ ఎస్‌హెచ్‌ఓ హర్షద్ అహ్మద్‌ను హుటాహుటిన శ్రీనగర్ తరలించారు. బలగాల ఎదురుకాల్పుల్లో ఒక ఉగ్రవాది సైతం హతమయ్యాడు. కాల్పులు కొనసాగుతున్నట్టు సమాచారం. కాగా, అనంత్‌నాగ్ బస్ట్ స్టాంప్ సమీపంలో కేపీ చౌక్ వద్ద 116 బెటాలియన్ గస్తీ తిరుగుతుండగా ఉగ్రవాదులు ఈ కాల్పులకు దిగినట్టు సీఆర్‌పీఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇది ఫిదాయిన్ (ఆత్మాహుతి) దాడిలా కనిపిస్తోందని పోలీసు వర్గాలు అంటున్నాయి.




## 21న కాళేశ్వరం ప్రారంభం

- 121 టీఎంసీల నీటి నిల్వ
- ముఖ్యఅతిథిగా జగన్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఈనెల 21న ప్రారంభించాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే సీఎం కేసీఆర్ స్వయంగా విజయవాడ వెళ్లి జగన్‌ను ఆహ్వానించనున్నారు. దాదాపు 151 టీఎంసీల గోదావరి జలాలను ఒడిసిపట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

## శాంతియుత దేశాలులో

- ఐస్‌ల్యాండ్ తొలిస్థానం
- భారత్ 141
- అట్టడుగున ఆఫ్ఘనిస్తాన్



న్యూఢిల్లీ: శాంతియుత దేశాల జాబితాలో భారత్ స్థానం దిగజారింది. గతంతో పోలిస్తే ఐదు స్థానాలు పడిపోయి 141వ స్థానంలో నిలిచింది. మొత్తం 163 దేశాలకు సంబంధించి విడుదలైన గ్లోబల్ పీస్ ఇండెక్స్-2019 ఈ విషయాన్ని వెల్లడించింది. ఇందులో ఐస్‌ల్యాండ్ ఎప్పటిలానే తొలి స్థానంలో నిలవగా.. అఫ్ఘానిస్థాన్ అట్టడుగు స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకానమిక్స్ అండ్ పీస్ ఈ ర్యాంకులను ప్రకటించింది. సమాజ భద్రత, భద్రత స్థాయి, దేశీయ, అంతర్జాతీయ విభేదాలు, సైనికీకరణ వంటి పలు అంశాలను కొలమానంగా తీసుకుంది. తరువాయి 2లో..

## ఏపీ ఆర్టీసీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతా!

- ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస నేతలతో జగన్
- సమ్మెయోచన విరమణ
- ప్రకటించిన ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస నేతలు



అమరావతి: ఏపీ సీఎం జగన్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస నేతల భేటీ ముగిసింది. శాసనసభలోని సీఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశంపై కమిటీ వేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఐకాస నేతలు మీడియాతో మాట్లాడుతూ.. తమ డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించడంతో సమ్మె యోచన విరమించుకుంటున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వస్తున్న అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కార్మికులకు సమస్యలు లేకుండా చూస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు.

**ఇక మీరంతా ప్రభుత్వ ఉద్యోగులే**
**కార్మిక నేతలతో సీఎం**

నష్టాలపై ప్రస్తావించిన తరువాయి 2లో..



# అందరి సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాం : జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

## సెరిమోనియల్ పరేడ్‌లో పాల్గొన్న ఎస్పీ



విజయనగరం : జిల్లా ఎస్పీగా పనిచేసి, బదిలీపై వెళ్ళుచున్న ఎ.ఆర్.దామోదర్ గౌరవార్ధం పోలీసు పరేడ్ గ్రౌండులో బుధవారం సెరిమోనియల్ పరేడ్‌ను విజయనగరం ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ గారు ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ -తాను జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కేవలం నాలుగు మాసంలోనే జిల్లాపై పూర్తిగా అవగాహన పెంచుకొని,సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతయుతంగా, ష్పక్షపాతంగా, ఎటువంటి చిన్న అవాంఛనీయ సంఘటన కూడాజరగకుండా పారదర్శకంగా నిర్వహించడానికి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం, అధికారులు, పోలీసు సిబ్బంది,హెూంగార్డులు తనకు అందించిన సహాయ, సహకారాలను మరువలేనన్నారు. ఎన్నికల కమీషను ఆదేశాలను అమలు చేసి, పార్టీలకు అతీతంగా పనిచేసి జిల్లాను అన్ని విభాగాల్లోను రాష్ట్రంలోనే ప్రథమ స్ధానంలో నిలిపామన్నారు. జిల్లా ప్రజలంతా చాలా మంచివాళ్లని, అనవసరంగా తగువులు, గొడవలు పడే అలవాట్లు ఇక్కడివారికి లేదన్నారు. తనకు అన్ని విధాలుగా సహకరించిన ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం తరుపున అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె. రామ్మోహనరావులు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్‌ను ఘనంగా పుష్పగుచ్ఛాలుతోను, శాలువలతోను సత్కరించి,జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె. రామ్మోహనరావు, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, బొబ్బిలి ఎఎస్పీ గౌతమీ శాలీ, పార్వతీపురం ఎఎస్పీ సుమిత్ గరుడ్, ఎస్‌బి డిఎస్పీసి. మురళీ నాయుడు, ట్రాఫిక్ డిఎస్పీ ఎం. శ్రీనివాసరావు, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీలు బి. మోహన రావు,సిహెచ్. పాపారవు, సిసిఎస్ డిఎస్పీ జె. పాపారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, సిఐలు జి. రామకృష్ణ, వెంకటఅప్పారావు, ఎర్రంనాయుడు, శ్రీహరిరాజు, రమేష్, ఆర్‌ఐలు రామకృష్ణ, రమేష్, శంకరరావు, గురుమూర్తి,కమ్యూనికేషన్ సిఐ రమణ మూర్తి, పలువురు సివిల్ ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, మరియు ఇతర పోలీసు అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**విశాఖ అర్బన్-2 ప్రాజెక్టులో మద్దిలపాలెం సెక్టార్‌లో గల కెఆర్ఎం.కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోందిలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆర్.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆటపాటల మధ్య అంగన్‌వాడీ విద్య వుంటుంది అని, వారిలో నైపుణ్యాలు మెరుగుపర్చడం జరుగుతుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.**

## జిల్లా ఎస్పీగా

# నయీమ్ అస్మీ బాధ్యతలు



కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా ఎస్పీగా నయీమ్ అస్మీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యల పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డిని,జెసీమల్లిఖార్జునను మర్యాద పూర్వకంగా కలిసారు.అనంతరం జిల్లా స్పెషల్ బ్రాచ్‌ఫీల్డ్ అధికారులు,సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహిచారు.ఫీల్డ్ అధికారులతో ఒక్కక్కరితోమాట్లాడి వారి సమస్యలు తదితర అంశాలను తెలుసుకున్నారు.పారదర్శంగా విధులు నిర్వహించాలని , ఏదైనా ముఖ్య సమాచారం ఉంటే తనకు ఫోన్ ద్వారా తెలియ జేయాలన్నారు. అలాగే తమ పరిదిలో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, కులమత, రాజకీయపరమైన సంఘటనల ముందుగానే సేకరించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం స్పెషల్‌బ్రాంచ్ ,జిల్లా క్రైం బ్రాంచ్, క్లూస్‌టీం,ఐటికోర్ విభాగాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్బీ డిఎస్పీలుఎస్.మురళీ మోహన్,ఎ.పల్లపురాజు,ఎస్బీ సిఐ.ఎస్. రాంబాబు, ఫీల్డ్ అండ్‌ఆఫీస్ సిబ్బంది,డిసిఆర్‌బి సిఐ.వైఆర్కే. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పరవాడలో కృష్ణమూర్తికి ఘన సన్మానం



పరవాడ : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలకేంద్రమైనపరవాడలోగల రామాలయంలో హిందూ ధర్మప్రచార కార్య క్రమంలో భాగంగా హరికథా గాన సుధాకర్ చిక్కంతా కృష్ణమూర్తికీ మండలం కన్వీనర్ చుక్క సన్యాసి రావు మరియు గ్రామసభ్యులు పైల పోతునాయుడుబీ గెడ్డం రమణబీ ఉపమండల కన్వీనర్ వానపల్లి అప్పలరాజు సన్మానం చేశారు. ప్రతీసంవత్సరం హిందూ ధర్మం ప్రచారం చేయాలని సంస్థ పెద్దలు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగి రాజేశ్వరి పతివాడ ఉమా బెంక్కిలి సత్యవతి పరవాడ జగదీష్ కంకాటాల రామకృష్ణ పైల సత్యనారాయణ పరవాడ లోవరాజుబీ జిల్లా సభ్యులు మల్లి మడుగుల నాగపేరరాజుబీ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విజయగణపతికి పంచామృతాభిషేకాలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో బుధవారం ఉదయం విజయగణపతికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని మహాగణపతికి స్నపనము, అభిషేకము, అర్చన మరియు ప్రత్యేక పూజలను దేవాలయం ప్రధాన అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ గావించారు. ఈ ఉత్సవంలో రామనారాయణం సీఈఓ టిఎల్ఎన్ మూర్తి, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు, ఎం వి రమణ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర పర్యాటక మంత్రి అవంతి శ్రీనువాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము



సబ్బవరం : రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు అవంతి శ్రీనువాసరావుకు విశాఖ జిల్లా వైసిపి బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము ఆయన నివాసానికి బుధవారం వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తొలిసారిగా మంత్రి పదవిని అలంకరించిన అవంతి శ్రీనువాసరావుకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. పర్యాటక రంగంలో రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని మంత్రి వర్యులను కోరారు.ఈ కార్యక్రమంలో సబ్బవరం మండల వైసిపి నాయకులు వనం అచ్చెంనాయుడు, కొటాన కోటయ్య, బైలపూడి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న బడిబాట మండల కేంద్రంలో ప్రారంభోత్సవం చేసిన కొటాన రాము



సబ్బవరం : మండల కేంద్రంలో రాజన్న బడి బాట ప్రారంభోత్సవం చేసిన బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము బుధవారం ప్రారంభించారు. గ్రంధాలయం ప్రక్కన యూపి స్కూల్‌లో ముందుగా జెండా వందనంగావించి బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, ఎంపిపి గొర్లె ఉమామహేశ్వరరావు రాజన్న బడి బాటను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న బడి బాటలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ బడిబాటలో స్కూల్ ఫీజులు ఉండవన్నారు. ప్రైవేటు స్కూల్ కన్నా రాజన్న బడి బాటే మంచిదని ఇక్కడ అన్ని సదుపాయాలు ఉంటాయన్నారు. ఉచితంగా పుస్తకాలు, బట్టలు అన్నీ ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌లు ప్రతీ విద్యార్థికి ప్రభుత్వమే అందిస్తుందన్నారు. నేడు మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలందాలని తెలిపారు.ప్రైవేట్ స్కూల్ చదువుల కన్నా ప్రభుత్వ స్కూల్ చదువులే మంచిదని విద్యార్థులు చదువులు అనంతరం ప్రభుత్వ స్కూల్ సర్టిఫికేట్ వస్తుందని కావున తల్లి దండ్రులారా ఆలోచించి విద్యార్థులను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైస్ ఎంపిపి కొటాన కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# కొలువుదీరిన కొత్త సభ

నాయకుడి స్థానాన్ని అధిష్టించడం రాష్ట్ర చరిత్రలో ఇది మూడోసారి. గతంలో ప్రజా ముఖ్యమంత్రులుగా ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి సభా నాయకులుగా రాష్ట్ర శాసనసభకు వన్నె తెచ్చారు. మళ్లీ కొత్త చరిత్రను లిఖిస్తూ వైఎస్ జగన్ అద్వితీయమైన ప్రజాదరణతో పార్టీని విజయపథంలో నడిపించి ప్రజా ముఖ్యమంత్రిగా శాసనసభలో సభానాయకుడి స్థానాన్ని అలంకరించారు.

15వ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

ఆంధ్రప్రదేశ్‌లో నూతన శకానికి తెరతీసిన 15వ శాసనసభ కొలువుదీరింది. ఐదుకోట్ల మంది రాష్ట్ర ప్రజల ఆశలను మోసుకుంటూ భవితకు భరోసానిస్తూ కొత్త శాసనసభ తొలిసారిగా బుధవారం సమావేశమైంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అఖండ మెజార్టీతో ప్రజలు ఓ పార్టీకి అధికారం అప్పగించిన శాసనసభ. చరిత్ర సృష్టిస్తూ సుదీర్ఘ పాదయాత్ర చేసిన జననేత ముఖ్యమంత్రిగా సభా నాయకుడి హోదాను అలంకరించిన సభ కూడా ఇదే. 25 మంది మంత్రుల్లో ఏకంగా 19 మంది కొత్త మంత్రులుగా అధికార స్థానాల్లో కూర్చున్నారు. గత 30 ఏళ్లలో అత్యధిక శాతం మంది కొత్త ఎమ్మెల్యేలు చట్టసభలో అడుగుపెట్టిన సభ కూడా ఇదే.. తొలిసారిగా కొలువుదీరిన 15వ శాసనసభపై ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. గత శాసనసభ ప్రజాస్వామ్యానికి మిగిల్చిన మరకలను చెరిపేస్తూ.. గత ఐదేళ్ల కష్టాల నుంచి సాంత్వన కోరుతూ కొత్త శాసనసభ వైపు ఆశ.

సీఎంగా తొలిసారి శాసనసభలోకి..



అశేష ప్రజాభిమానంతో తిరుగులేని జననేతగా గుర్తింపు పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. అద్వితీయమైన ప్రజాదరణ ఉన్న నేత సభా నాయకుడి స్థానాన్ని అధిష్టించడం రాష్ట్ర చరిత్రలో ఇది మూడోసారి. గతంలో ప్రజా ముఖ్యమంత్రులుగా ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి సభా నాయకులుగా రాష్ట్ర శాసనసభకు వన్నె తెచ్చారు. మళ్లీ కొత్త చరిత్రను లిఖిస్తూ వైఎస్ జగన్ అద్వితీయమైన ప్రజాదారణతో పార్టీని విజయపథంలో నడిపించి ప్రజా ముఖ్యమంత్రిగా శాసనసభలో సభానాయకుడి స్థానాన్ని అలంకరించారు.

ఉదయం 11.05 గంటలకు ప్రారంభమైన సభ..

రాష్ట్ర 15వ శాసనసభ తొలి సమావేశం బుధవారం ఉదయం 11.05 గంటలకు ప్రారంభించారు. ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన శంబంగి చిన వెంకట అప్పలనాయుడు కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత ముఖ్యమంత్రి, సభానాయకుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రమాణ స్వీకారం, అనంతరం మాజీ ముఖ్యమంత్రి, విపక్ష నేత చంద్రబాబు, మంత్రులు, సభ్యులతో అక్షర క్రమంలో ప్రమాణ స్వీకారం చేయించారు. నేడు స్పీకర్‌గా తమ్మినేని సీతారాం ఏకగ్రీవంగా ఎంపిక కానున్నారు.

అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రులు ఆయన్ను అధ్యక్ష స్థానం దగ్గరకు తీసుకెళ్లి కూర్చోబెట్టి అభినందనలు తెలియజేశారు. స్పీకర్‌గా ఎన్నికైన సీతారాంకు సభ అభినందనలు తెలియజేసింది. 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఉభయసభల సభ్యులనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. కొత్త ప్రభుత్వ విధానాలు, లక్ష్యాలను గవర్నర్ తన ప్రసంగం ద్వారా స్పష్టం చేయనున్నారు. గవర్నర్ ప్రసంగం ముగిశాక సభ వాయిదా పడుతుంది. 15, 16వ తేదీలు సెలవు రోజులు కావడంతో సభ తిరిగి 17వ తేదీన ప్రారంభం అవుతుంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరగుతుంది. సభలో జరిగిన చర్చకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెబుతారు. దీంతో ఈ సమావేశాలు ముగుస్తాయి.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

నిలిచారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకన్నా అంటూ ఈ విషయం గురించి అమితాబ్ తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు... బిహార్‌లోని 2100 మంది రైతుల రుణాలు కట్టాను. ఒకే దఫాలో బ్యాంకుకు పడ్డ బాకీని తీర్చేశాం. శ్వేత, అభిషేక్ కొంతమంది రైతులకు నేరుగా చెక్కులు అందించారు. మిగతా వాళ్లకు రైతు నాయకుల ద్వారా అందజేసాం. మాట ఇచ్చాను. బుధవారం దానిని నిలబెట్టుకున్నా అని బ్లాగులో రాసుకొచ్చారు. కాగా అమితాబ్ గతంలో కూడా వందలాది మంది రైతులకు అండగా నిలిచిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్ రైతుల బాకీలు తీర్చిన 76 ఏళ్ల ఈ బిగ్ బీ వారి హృదయాల్లో స్థానం సంపాదించాడు.

# ఏపీ ఆర్టీసీని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతా!

కార్మికులను ముఖ్యమంత్రి జగన్ సముదాయించారు. ఆర్టీసీ సమస్యలు ఇక ప్రభుత్వ బాధ్యత అని కార్మికులతో చెప్పారు. ఇక మీరంతా ప్రభుత్వ ఉద్యోగులని కార్మికులతో సంబోధించారు. ఆర్టీసీని ఆధునీకరిస్తామని కార్మిక సంఘాలకు జగన్ హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే ఆర్టీసీని అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దుతానన్నారు.

# శాంతియుత దేశాలులో

ఈ నివేదిక ప్రకారం.. ఐస్‌ల్యాండ్ ప్రపంచంలోనే శాంతియుతంగా దేశంగా చోటుదక్కించుకుంది. 2008 నుంచి ఈ దేశానిదే తొలిస్థానం కావడం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో న్యూజిల్యాండ్, ఆస్ట్రియా, పోర్చుగల్, డెన్మార్క్ ఉన్నాయి. అట్టడుగు దేశాల్లో అఫ్గానిస్థాన్ నిలిచింది. సిరియా స్థానాన్ని ముందుకు నెట్టి ఆ స్థానంలో అఫ్గాన్ చేరింది. ఇక దక్షిణ సూడాన్, యెమెన్, ఇరాక్ తర్వాతి అట్టడుగు దేశాల జాబితాలో నిలిచాయి.

దక్షిణాసియా దేశాల విషయానికొస్తే భూటాన్ (15), శ్రీలంక (72), నేపాల్ (76), బంగ్లాదేశ్ (101) స్థానాల్లో నిలిచాయి. పొరుగుదేశం పాకిస్థాన్ 153వ ర్యాంకు దక్కించుకుంది. భారత్ సహా ఫిలిప్పీన్స్, జపాన్, బంగ్లాదేశ్, మయన్మార్, చైనా, ఇండోనేసియా, వియత్నాం, పాకిస్థాన్ వంటి 9 దేశాలు బహుళ ప్రకృతి వైపరీత్య ప్రమాదాలు పొంచి ఉన్న దేశాలుగా ఈ నివేదిక గుర్తించింది. ఇక భారత్, అమెరికా, చైనా, సౌదీ అరేబియా, రష్యా దేశాలు రక్షణ కోసం అధిక వ్యయం చేస్తున్న ఐదు దేశాలుగా పేర్కొంది. ప్రపంచంలో గత ఐదేళ్లతో పోలిస్తే ప్రపంచ శాంతి మెరుగుపడిందని, దశాబ్దంతో పోలిస్తే ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపింది.

# చేపల పెంపకంలో నైపుణ్య శిక్షణ

## 9 రాష్ట్రాల ప్రతినిధులు హాజరు

కూసుమంచి : దేశవ్యాప్తంగా చేపలు, రొయ్యల వేట ద్వారా జీవనం గడుపుతున్న లక్షలాది మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నింపాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. 2022 నాటికి వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడం లక్ష్యంగా 'నీలి క్రాంతి' కార్యక్రమాన్ని చేపడ్తోంది. మత్స్యకారుల ఆదాయం రెట్టింపు కావాలంటే.. చేపల ఉత్పత్తి సైతం అదే స్థాయిలో పెరగాలి. అందుకు చేపల సాగు విస్తీర్ణం పెరగాలి. చేపల సాగుకు రైతులు ముందుకు రావాలంటే ప్రభుత్వం తగు సదుపాయాలు కల్పిస్తూ.. రాయితీ పథకాలను అమలు చేయాలి. ఈ కోణంలో అనేక విభాగాల్లో లక్ష్యాలను నిర్దేశించుకున్న ప్రభుత్వం ఏ విభాగంలో ప్రభుత్వ రాయితీ పొందాలన్నా.. ఆ రంగంలో నిర్వాహకులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పాలేరులోని మత్స్యపరిశోధన కేంద్రం ద్వారా వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 'ఆక్వా క్లినిక్'(చేపల వైద్యశాల), ఆక్వా ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పాలేరు పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న 30రోజుల శిక్షణ కార్యక్రమానికి దేశంలోని 9రాష్ట్రాల నుంచి వచ్చిన 30 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, జాతీయ వ్యవసాయ విస్తరణ నిర్వహణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వీరందరికి భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తూ.. నిష్ణాతుల చేత శిక్షణ ఇస్తున్నారు. బుధవారంతో శిక్షణ పూర్తవుతున్న నేపథ్యంలో శిక్షణ ఉపయోగపడిన తీరుపై వివిధ రాష్ట్రాల ప్రతినిధుల అభిప్రాయాలను 'న్యూస్‌టుడే' సేకరించింది. వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

**మెలకువలు నేర్చారు:** కవిత, తమిళనాడు : చెరువుల్లో, పంజర వలల్లో చేపల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆయా విధానాల్లో పెంపకం చేపట్టే చేప రకాలు... వాటికి చిన్న వయస్సు నుంచి విక్రయించే వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆహారం, వాటికి సంక్రమించే వ్యాధులు, గుర్తింపు, నివారణ చర్యలపై అవగాహన ఏర్పడింది. మత్స్య రైతులకు ఎంతో మేలైంది - శివాని, బిహార్ : శిక్షణకు రాకముందు పంజరవల విధానంలో చేపలను పెంచడంపై నాకు అవగాహన లేదు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడులు తీసే విధానం ఇది.

# రాజన్న బడి బాట ప్రారంభం

రోలుగుంటః విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే చర్యల్లో భాగంగా ఈ నెల 12 నుంచి 15 వరకూ రాజన్న బడి బాట కార్యక్రమం ప్రారంభించినట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.కిరణ్మయి తెలిపారు. మొదటి రోజు పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగత సంబరం నిర్వహించామన్నారు. పాఠశాలల్లో చేరిన చిన్నారులను ఆత్మీయంగా ఆహ్వానించి వారితో బమ్మలు గీయించడంతో పాటు రంగు కాగితాలతో వివిధ ఆకృతులు తయారు చేయించామన్నారు. అదే విధంగా ఈ నెల 13న వందనాభినయం అనే కార్యక్రమంలో విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగిస్తారు. తర్వాత అభినయ గేయాలు, కథలు, పాటలతో ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తారన్నారు. 14న అక్షర కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, దాతలతో కలిసి కొత్తగా చేరిన విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తారు. 15న వందనం - అభివందనం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రముఖులతో స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు, బాలికా విద్యకు సూచనలు, సలహాలు, తల్లిదండ్రుల సమావేశ నిర్వహణ, ప్రతిభ ఉన్న విద్యార్థులకు సత్కారం, సహపంక్తి భోజనాలతో కార్యక్రమాలు ముగిస్తామని ఆమె వివరించారు.

# వరి విత్తనాలు పంపిణీ



నాతవరంః రాయితీపై వరి విత్తనాలను బుధవారం నుంచి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాతవరం వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ మండలంలో 30 శాతం మంది రైతులకు ఈ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌జెల్ 25 కేజీల బస్తా కేజికి 10 రాయితీ పోను రూ.560లు, 1061 30 కేజీల బస్తా రూ.670, 1064 30 కేజీల బస్తా రూ.484, 1156 30 కేజీల బస్తా రూ.475, బిపిటి సన్న రకాలు 25 కేజీల బస్తా రూ.565 రైతులకు అందజేయనున్నామన్నారు. మండలంలో 6103 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారని చెప్పారు. వీరికి 120 టన్నుల వరి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్, ఆధార్ కార్డు, రైతు కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్ విధిగా తీసుకురావాలన్నారు.

# మినీ అంగన్వాడీలకు మెయిన్ వర్కర్లతో సమాన వేతనం ఇవ్వాలి

## అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి మంజుల డిమాండ్



విశాఖపట్నంః మినీ అంగన్వాడీలకు మెయిన్ అంగన్వాడీలతో సమానంగా వేతనాలు చెల్లించాలని అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి మంజుల డిమాండ్ చేశారు. బుధవారం నర్సీపట్నం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖజిల్లాలో 1365 మంది మినీ వర్కర్లు ఉన్నారన్నారు. ఆయా పని, టీచర్‌తో సమాన పని చేస్తున్న వీరికి గౌరవ వేతనం విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరికి న్యాయం జరగడానికి ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. 1000 రూపాయలు అంగన్వాడీలకు వేతనం పెంచిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ 18వేలు చెల్లించే విషయమై చర్యలకు పిలవాలని కోరామన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ పింఛన్ సౌకర్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషం (ఏఐటియుసి) జిల్లా గౌరవ అధ్యక్షులు బాలేపల్లి వెంకటరమణ, అధ్యక్షులు ఎం.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అనురాధ, జిల్లా సమితి సభ్యులు కామేశ్వరి పాల్గొన్నారు.

# ప్రహారీ మెట్లనుతొలగించడంపై ఫిర్యాదు



నర్సీపట్నంః మున్సిపాలిటీ 13వ వార్డులోని జోగినాధుపాలెంకు చెందిన రామసత్యంకు చెందిన ఇంటి ప్రహరి మెట్లను మున్సిపాలిటీ అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారని బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామసత్యం విలేకరులతో మాట్లాడుతూ తాను గత 40 ఏళ్లుగా జోగినాథునిపాలెంలో నివసిస్తున్నానని ఇటీవల ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద రుణం మంజూరు కావడంతో ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. వారం రోజుల క్రితం కొంతమంది మున్సిపల్ అధికారులు తన వద్దకు వచ్చి నిబంధనలు అతిక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు అందిందని, మీకున్న డాక్యుమెంట్లు తీసుకురమ్మని చెప్పారన్నారు. సంబంధిత పత్రాలను తీసుకొని మున్సిపల్ కమిషనర్‌ను, టౌన్ ప్లానింగ్ అధికారిని కలిసి వివరించానని, ఏమైనా తొలగించాల్సి వస్తే మీ సూచనల మేరకు తొలగిస్తానని చెప్పానన్నారు. అయినప్పటికీ రాజకీయ ఒత్తిళ్ల మేరకు నేను ఊర్లో లేని సమయంలో ప్రొక్లెయినర్ తీసుకువచ్చి నా ఇంట్లోకి వెళ్లే మెట్లతో పాటు, ప్రహరీ గోడను కూడా తొలగించారని ఆరోపించారు. తనకు సమాచారం లేకుండా ఇలాంటి చర్యలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# బోటు బోల్తా పడి జాలరి మృతి



నాతవరంః తాండవ జలాశయంలో బోటు బోల్తా పడి జాలరి మృతి చెందాడు. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు నక్కపల్లి మండలం బోయపాడు గ్రామానికి చెందిన వాసుపల్లి శ్రీను(27) ఇక్కడ జలాశయంలో చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం చేపల వేటకు బోటుపై వెళ్లాడు. అయితే గాలులతో బోటు బోల్తా పడి శ్రీను కనిపించకుండాపోయాడు. దీంతో శ్రీను మృతదేహం బుధవారం ఉదయం జలాశయంలో తేలుతు కనిపించింది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# పంచాయతీ స్థలం ఆక్రమణపై చర్యలకు వినతి

రావికమతంః చినపాచిలలోని గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైందని, సర్వే చేయించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ వైసిపి నాయకులు తహశీల్దార్ నారాయణకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి గతంలో కేటాయించిన స్థలంలో పక్కా భవనం నిర్మించగా మిగిలిన దానిలో కొంత స్థలాన్ని కోమటి శంకరరావు ఆక్రమించారని ఆరోపించారు. దీనిపై సర్వే చేయించి పంచాయతీ స్థలమని తేలితే ఆక్రమణలు తొలగించాలని ఆ ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి నాయకులు కొమార రాజులు, జనపాల వెంకటరావు, కొమార ప్రసాద్, ఎస్.మహేష్, జి.సత్యనారాయణ, పి.త్రిమూర్తులు తదితరులు ఉన్నారు. సర్వే చేయించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

# దళితుల భూముల దురాక్రమణను అరికట్టాలి



డాబా గార్డెన్స్ః భీమునిపట్నం నిడి గట్టు గ్రామంలో దళితుల భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ దళిత విముక్తి ఉత్తరాంధ్ర కమిటీ కన్వీనర్ సుర్ల వెంకటరమణ కోరారు. బుధవారం వీ జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న భీమిలి పోలీసులు, రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులు దళితులు ముదపాక వరలక్ష్మి, అనురాధ, రాంబాబు లకు చెందిన సర్వే నంబర్ 44/3, 5 లలో ఉన్న భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నా యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం ఎంత వరకు సమంజసమన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కబ్జాదారులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో బాధితులు రాంబాబు, నర్సింగరావు, వరలక్ష్మి, అనురాధ లు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పెట్టెలు సిద్ధం

యలమంచిలి రూరల్ః స్థానిక సంస్థల ఎన్నికలకు రెవెన్యూ మండల పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాలెట్ బాక్స్‌ల బూజుదులుపుతున్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్, కార్పొరేషన్ ఎన్నికల కోసం వీటిని సిద్ధం చేస్తున్నారు. చాలా కాలంగా ఇవి వాడకపోవడంతో కొన్ని తుప్పుపట్టిపోయాయి. వీటిని శుభ్రం చేసి ఆయిల్ రాస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల జాబితా కులాల వారీగా తయారు చేశారు. ఇప్పుడు బాక్స్‌ల సిద్ధం చేస్తున్నారు. జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలకు 40వేల బ్యాలెట్ బాక్స్‌లు అవసరమని అధికారులు గుర్తించారు. 2013లో పంచాయతీ ఓటర్లు 16.79లక్షలు మంది ఉండగా 2019 ఏప్రిల్ నాటికి 18.02 లక్షలకు పెరిగారు. పల్లెల్లో కులాల వారీగా ఓటర్లను గుర్తించారు. దీని ప్రకారం రిజర్వేషన్లు ఉంటాయి. దీంతో మండల కేంద్రాల్లో ఉన్న బ్యాలెట్ బ్యాక్స్‌లను శుభ్రం చేసి సిద్ధం చేస్తున్నారు. ఇవి ఎన్ని ఉన్నాయో గుర్తించాక అదనపు బాక్సుల సేకరణపై దృష్టిసారిస్తారు. తహశీల్దార్‌లు, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు చేస్తున్నారు. వారం రోజుల్లో బ్యాలెట్ బాక్స్‌లన్నీ సిద్ధంగా చేసి ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులకు జీతంపెంపుపట్ల హర్షం

## మునిసిపల్ మంత్రి బొత్సకు కృతజ్ఞతలు



గాజువాకః జీవీఎంసీ గాజువాక జోన్ , సి ఐ టి యు ఆఫీసు చిన్న గంట్యాడ నందు బుధవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరిగింది . తేదిః-11-6-2019 న విజయవాడలో నోవాటెల్ హోటల్లో ఏపీ మున్సిపల్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, ఏపీ రాష్ట్ర మునిసిపల్ అధ్యక్షుడు జి. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు, నూకరాజు నాయుడు, తదితర నాయకులు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణని కలిసి పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం 18 వేల రూపాయలు పెంచి నందుకు హర్షం వ్యక్తం చేశారు అందుకు ధన్యవాదాలు చెప్పాటము జరిగింది ఈ సందర్భంగా జీవో 279 రద్దు చేయాలని , గతంలో ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన సమస్యలు పరిష్కారం చేయాలని, వినతి పత్రం ఇవ్వడం జరిగింది అని అన్నారు. మున్సిపల్ పరిధిలో పని చేయు వాటర్ సప్లై ,స్ట్రీట్ లైటింగ్, డ్రైవర్స్ ,సూపర్వైజర్లు, పార్క్ లో పనిచేయు కార్మికులు మరియు స్కూల్ టీచర్లు మొదలగు కేటగిరిలో పనిచేయు కార్మికులు అందరికీ కనీస వేతనం అమలు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది అని అన్నారు. దీనికి మున్సిపల్ శాఖ మంత్రి స్పందిస్తూ వీటిపై యూనియన్ తో త్వరలో చర్చ జరిపి న్యాయం చేస్తామని అన్నారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న 81వార్డు లలో పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, డ్రైవర్లు, సూపర్వైజర్లు, వాటర్ సప్లై, యూ సి డి లో పనిచేస్తున్న మొత్తం కార్మికులందరూ ఉదయం 10 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వెనక ఉన్న గాంధీ పార్క్ దగ్గరికి రావాలి అని కోరారు. నూతన ప్రభుత్వానికి యూనియన్ తరపున రాతపూర్వకంగా ఇచ్చిన వినతి పత్రంలో విషయాలు కార్మికులకు తెలియజేయుటకు యూనియన్ గా ఇస్తున్న పిలుపునకు అందరూ రావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కె.వి.రమణ నూకరాజు గణేష్ కుమార్ రాము పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



పరవాడః శ్రీహరిపురంనకు చెందిన చింతా ఆనంద్ జయరాజ్ ,మీనాక్షమ్మ దంపతుల జ్ఞాపకార్థము వారి కుమారుడు సిహెచ్ .ఎమ్ ఎస్ కుమార్ ఆర్థిక సహాయంతో బుధవారం పరవాడ బి సి కొలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు 5,000 వేలు విలువ చేసేపుస్తకాల నుపంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిలుగా స్కూల్ కమిటి మాజీ చైర్మన్ పైల టివి అప్పారావు, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు టి.నిర్మలకుమారి హజరై వీళ్ళు చేతుల మీదగా విద్యార్థులుకు పంపిణీ చేసారు. అలాగే స్కూల్ కి సిద్దనాతి చిన్నారావు జ్ఞాపకార్థము వారి కుమారులు సిద్దనాతి మహేష్ ,శేఖర్‌ల ఆర్థిక సహయంతో రెండు విలువ చేసే ప్యాన్ ,ట్యూబ్ లైట్ ను వితరణ చేసారు,ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది , విద్యార్థులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటోనగర్ చిత్తుపేపర్ గొడౌన్‌లో అగ్నిప్రమాదం



గాజువాకః చిత్తుపేపర్ గొడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు రూ. 5లక్షల విలువైన సరుకు అగ్నిఆహుతైయ్యింది. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డి బ్లాక్‌లోని మహాక్ష్మి ఎంటర్ ప్రైజెస్ ప్లాస్టిక్ చిత్తు పేపర్ల గొడౌన్‌లో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.....ఆటోనగర్‌లో డిబ్లాక్‌లో మహాక్ష్మి ఎంటర్ ప్రైజెస్ పేరుతో ప్లాస్టిక్ చిత్తు పేపర్ల గొడౌన్ నిర్వహిస్తున్నారు. అయితే పక్కనే ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటల చెలరేగడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచాచం మేరకు అగ్నిమాపక సిబ్బంది, గాజువాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోనికి తీసుకొనిచ్చారు. సుమారు రూ. 5లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ నష్టం ఏమి జరగలేదని గాజువాక సి.ఐ. కోరాడ రామారావు తెలిపారు.


భారత ప్రభుత్వం
సామాజిక న్యాయం & సాధికారత మంత్రిత్వ శాఖ
సామాజిక న్యాయం & సాధికారత విభాగం
వయోజనుల డివిజన్

విషయం: వయోశ్రేష్ఠ సమ్మాన్-209 (వయోజనులకై జాతీయ అవార్డులు) - నామినేషన్ సమర్పణకై గడువు తేది పొడిగింపు సంబంధిత ప్రకటన

ఈ మంత్రిత్వ శాఖ యొక్క పైన పేర్కొనబడిన విషయమునకు సంబంధించి 7.4.209న ప్రచురితమైన ప్రకటన యొక్క పాక్షిక మార్పులు భాగంగా, సంబంధిత వ్యక్తులకు తెలియజేయనది ఏమనగా సామాజిక న్యాయం & సాధికారత విభాగములో నామినేషన్లు అందుకొనుటకు గడువు తేది 30.06.2019 వరకు పొడిగించబడినది.

(ఎస్.ఎస్. కుమార్)
భారత ప్రభుత్వపు డిప్యూటి సెక్రటరీ
టెలిఫోన్: 23388837

davp 38101/11/0011/1920


# అంగన్వాడీ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ

భీమునిపట్నంః భీమిలి డివిజన్ సంగివలస 27వ వార్డులో ఉన్న అంగన్వాడీ సెంటర్లో అంగన్వాడీ కార్యకర్త బి.వెంకట వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ సర్టిఫికెట్ లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 7గురు విద్యార్థులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్ లు పంపిణీ చేసారు. అనంతరం బడిబాట ర్యాలీ సంగివలస గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ స్కూల్ మాస్టర్ ప్రభాకరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.


VISAKHAPATNAM INDUSTRIAL WATER SUPPLY COMPANY

'e' Procurement Tender Notice No.02/2019-20/GM/VIWSCO/DB-III Dt:11-06-2019

| | | |
|---|---|---|
| 01.Number of Works | : | 20 Nos |
| 02.Value of Works (ECV) | : | Rs.256.84 Lakhs |
| 03.Down Loading Starting Date | : | 13-06-2019 @ 2.00 PM |
| 04.Down Loading Ending Date | : | 27-06-2019 @ 3.00 PM |
| 05.Last date of Bid submission | : | 27-06-2019 @ 4.00 PM |
| 06.Date of Opening of Tender | : | 27-06-2019 @ 5.00 PM |

Note: For any other details required in respect of above tender notice, please contact GM(VIWSCO) before applying for tender schedules and visit vsp @ www.apeprocurement.gov.in.

GM(VIWSCO)-FAC



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Total No of Tenders :4 Date:12.06.2019

| S. No | Tender Notice No. | No of Works | Estimate Cost | Download Starting Date | Download Ending Date | Last Date of Submission | Date of Tender Opening | Contact Phone No |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Eproc T.N.No.10/ 2019-20/EE-III(WS)/ DB-III, Dt.11.06.2019 | 1 Nos | Rs.5.93 Lakhs | 12.06.19 @ 2.00 PM | 19.06.19 @ 3.00 PM | 19.06.19 @ 4.00 PM | 19.06.19 @ 4.01 PM | 9951532876 |
| | Providing 100mm dia, 150mm & 250mm MS pipe | | | | | | | |
| | MECHANICAL SECTION | | | | | | | |
| 2 | Eproc Sh.T.N.No.15/2019-20/ EE(Mech) Dt:11.06.2019 | 2 Nos | Rs.29.32 Lakhs | 12.06.19 @ 6.00 PM | 19.06.19 @ 2.00 PM | 19.06.19 @ 3.00 PM | 19.06.19 @ 3.30 PM | 9948078504/ 9912349476 |
| 3 | Eproc T.N.No.08/2019-20/ S.E(W II)/EE III/DD/Dt:11.06.2019 | 10 Nos | Rs.1,38,87,975.00 | 12.06.19 @ 3.00 PM | 19.06.19 @ 3.00 PM | 19.06.19 @ 3.30 PM | 19.06.19 @ 4.00 PM | 0891-2746301 |
| | Date of opening Tenders (Price Bid) . 21.06.19 @ 4.00 PM | | | | | | | |
| | ELECTRICAL SECTION | | | | | | | |
| 4 | Eproc T.N.No. (/2019-20/ EE(ELEC). Dt:11.06.2019 | 1 No | Rs.6.77 Lakhs | 12.06.19 @ 7.00 PM | 28.06.19 @ 2.00 PM | 28.06.19 @ 2.30 PM | 28.06.19 @ 3.00 PM | 9848882560 |

Note: For any other details required in respect of above Tender Notice, please contact Concerned Phone No before applying for Tender Schedules and visit vsp : @ www.apeprocurement.gov.in

For Commissioner


## అలాంటి పుకార్లు వ్యాప్తిచేస్తే చర్యలు: డీజీపీ

హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, వృద్ధులు అదృశ్యమవుతున్నారంటూ అసత్య ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోందని తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. అదృశ్య కేసుల్లో చాలా వరకు కుటుంబంలో కలహాలు, ప్రేమ వ్యవహారం, పరీక్షల్లో విఫలం కావడం తదితర కారణాల వల్లే జరుగుతున్నాయని తెలిపారు. కుటుంబాన్ని విడిచి వెళ్లిన మహిళలు, పురుషులు, తల్లిదండ్రులపై అలిగి వెళ్లిన పిల్లలు, పిల్లల సంరక్షణ దొరకని తల్లిదండ్రులు మొదలైన కారణాల వల్లే అధిక కేసులు నమోదయ్యాయని ట్విటర్‌లో పేర్కొన్నారు. అలాంటి కేసుల్లో 85శాతానికి పైగా గుర్తించడమే కాకుండా మిగిలిన కేసులను ఛేదించేందుకు తెలంగాణ పోలీసులు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజల భద్రతకు అహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల్లో భయాందోళనల్ని కల్గించే విధంగా సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా పుకార్లను వ్యాపింపజేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరించారు.


రక్షణ మంత్రిత్వ శాఖ
నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం
(టెలిఫోన్: 0891 286329, 6371 ఫ్యాక్స్: 0891 2511140)
ఇ-టెండరు ప్రకటన

కోటింగ్ నెం. ఎంఎస్ఐటి/0639/ఎఫ్ఎంఎస్/టిఇ/02/19-20 తేది: 07 జూన్ 9

1. ఒక సంవత్సరం కాలం పాటు నేవల్ డాక్‌యార్డు విశాఖపట్నం నెట్‌వర్క్‌లు, సిస్టవమ్ పిసిఎల్, సర్వర్లు, స్విచ్‌లు మరియు వస్తువులు యొక్క నిర్వహణకై ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సేవలకై ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.

2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 65,000/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.

3. **ప్రి-బిడ్డు సమావేశం:** ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 20 జూన్ 1430 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.

4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు "ఎంఐటి" అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయనగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 12 జూలై 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

డిజిఎమ్ (ఎంస్)

davp 10702/11/0065/1920

# విజయభాను సంపాదకీయం

## కరువా దోషులకు శిక్ష

దేశం యావత్తూ సిగ్గుతో తలదించుకునే రీతిలో జరిగిన అమానుషత్వానికి ఏడాదిన్నర కాలంలోనే తగిన శిక్షపడింది. జమ్మూకశ్మీర్‌లోని కరువాలో ఎనిమిదేండ్ల పసిబాలిక అసిఫాపై సాముహిక అత్యాచారం, హత్య కేసులో ముద్దాయిలు ఏడుగురిలో ఆరుగురిని పంజాబ్‌లోని పాటియాలా ప్రత్యేక న్యాయస్థానం దోషులుగా తేల్చింది. అందులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించగా మరో ముగ్గురికి సాక్ష్యాధారాలను నాశనం చేయటానికి ప్రయత్నించినందుకు ఐదేండ్ల శిక్షతో పాటు యాభై వేల రూపాయల జరిమానా విధించింది. ప్రధాన నిందితుడు సాం జిరాం కుమారుడిని సాక్ష్యాధారాలు లేనందున నిర్దోషిగా విడుదల చేసింది. గతేడాది జనవరిలో కరువాలో ముస్లిం మతవర్గం సంచార తెగకు చెందిన ఎనిమిదేండ్ల బాలిక అసిఫాపై జరిగిన దారుణం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. అడవిలో మేతకు వెళ్లిన గుర్రాలను చూపిస్తామంటూ నమ్మబలికి అమాయక బాలికను కిడ్నాప్ చేసి సమీపంలోని ఓ ప్రార్థనా మందిరంలో బంధించి సామూహిక లైంగికదాడికి ఒడిగట్టారు. ఓ క్షణికావేశ దుర్ఘటనగా కాకుండా నిందితు లు అత్యంత అమానవీయంగా ఆ పసిబాలికకు నాలుగురోజులు మత్తు మందు ఇచ్చి మరీ లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత విషయం బయటకు పొక్కకుండా ఉండటం కోసం సాక్ష్యాధారాలను నాశనం చేసేందుకు తలపై బండరాయితో కొట్టి హత్యచేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగికదాడుల్లో కరువా ఘటన అత్యంత అమానుషమైనదిగానే గాకుండా అనేక విధాలుగా దేశంలోనే అరుదైన దుర్ఘటనగా నిలువటం గమనార్హం. కరువా ఘటన నేపథ్యంలో దేశంలో ముఖ్యంగా జమ్మూలో జరిగిన ఆందోళనలు, వాదవివాదాలు మరింత అందోళనకరమైనవి. ఓ నేరానికి మత రంగు పులిమి దోషులకు మద్దతుగా నిలువటం సమాజ విచ్ఛిన్నానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. కశ్మీర్‌లో ఎంతమంది మహిళలపై దాడు లు జరుగటం లేదు, ఓ బాలికపై జరిగిన దాడికి ఇంత ప్రాధాన్యం ఎందుకనే వాదనలు వినిపించటం జుగుప్సాకరం. ఒకానొక దశలో పోలీసు లు కేసు నమోదు చేసుకోవటానికి కూడా నిరాకరించారు. ఇక నిందితులను అరెస్టు చేయటా న్ని నిరసిస్తూ హిందూ ఏక్తా మంచ్, కరువా బార్ అసోసియేషన్ లాంటి సంస్థలు జాతీయ జెండాలు పట్టి ప్రదర్శనలు చేశాయి. నిందితుల కు మద్దతుగా జరిగుతున్న ప్రదర్శనల్లో అప్పటి పీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలోని బీజేపీ మంత్రులు కూడా పాల్గొన్నారు. నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయటానికి వచ్చిన అధికారులను కరువా బార్ అసోసియేషన్ అడ్డుకున్నది. దీంతో బాధితులు తమకు అక్కడ న్యాయం జరుగదని కేసును మరోచోటుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టుకు వెళ్లటంతో కేసు పంజాబ్‌లో ని పాటియాలా కోర్టుకు బదిలీ అయ్యింది. మరో వైపు అసిఫా కేసులో బాధితులకు న్యాయం జరుగాలని, నిందితులు శిక్షింపబడాలని మహి ళా న్యాయవాది దీపికాసింగ్ రజావత్ అలుపెరుగని పోరాటం చేశారు. ఆ క్రమంలో దీపికాసింగ్ ఎదుర్కొన్న సమస్యలు మరింత దిగ్భ్రాంతి కలిగించేవిగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్‌నుంచి మిలిటెంట్ల దురాగతాలతో ఢిల్లీకి వలస వచ్చిన కశ్మీరీ పండిట్ కుటుంబానికి చెందిన మహిళగా దిపికాసింగ్ ముస్లిం బాలిక పక్షాన నిలువటాన్ని ఇరుగుపొరుగు వారు తీవ్రంగా తప్పుబట్టారు. రక్త సంబంధీకులు, ఇరుగుపొరుగు సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. చివరికి కోర్టులోని సహ న్యాయవాదులు కూడా మాట్లాడటం మానేశారు. దేశద్రోహి ముద్ర కూడా వేసి సూటిపోటి మాటలతో, ఈసడింపులతో కాకుల్లా పొడుచుకుతిన్నారు. కరువా ఘటన తీరు మాత్రమే కాదు, ఘటన వెనుక ఉన్న సామాజిక మూలాలు మరింత భీతిగొలిపేవిగా ఉన్నాయి. ముక్కుపచ్చలారని ఎనిమిదేండ్ల అమ్మాయిపై నడివయస్కులైన వారి తో సహా లైంగికదాడికి ఒడిగట్టడం వెనుక లైంగికాంశం ఎంతమాత్రం కాదు. గుర్రాలు, గొర్రెలు మేపుకొని బతికే నిస్సహాయ సంచార జాతికి చెందిన ముస్లిం సమూహాలను భయభ్రాంతులకు గురిచేసి ఆ ప్రాంతం నుంచి వారిని పారదోలటానికి నిందితులు ఎంచుకున్న కపట మార్గం అది. తద్వారా వారు ఆ ప్రాంతంలోని పచ్చికబయళ్ళను, వారి నివాస ప్రాంతాలను ఆక్రమించుకోవచ్చన్నది వారి పన్నాగం. ఆ నేపథ్యంలోంచే హిందూ జాగరణ్ మంచ్ లాంటి సంస్థలు లేవదీసి న వాదనలు అంతటి అమానవీయంగా, వివాదాస్పదంగా ఉన్నాయి. కేసు విచారణ సందర్భం గా న్యాయమూర్తి తేజ్వీందర్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు గమనార్హమైనవి. నిందితులు ఇదొక అటవి క రాజ్యంగా తలచి ఇష్టానుసారంగా వ్యవహరించారని తీవ్రంగా గర్హించారంటే పరిస్థితి తీవ్రత ను అర్థం చేసుకోవచ్చు.

## చిట్టి పెంగ్విన్లకు పెద్ద కష్టం!



విక్టోరియా : ఆస్ట్రేలియాలోని బుల్లి పెంగ్విన్‌లకు పెద్ద కష్టమే వచ్చిపడింది. 13 సెంటీ మీటర్ల కంటే పెద్దగా పెరగలేని ఈ పెంగ్విన్లకు కికియూ అనే గడ్డి శాపంగా మారుతోంది. గడ్డి శాపంగా మారడమేంటనేగా... 1992లో విక్టోరి యా ప్రాంతంలో విమానం లాండింగ్ సౌకర్యం కోసం కికియూ అనే గడ్డిని తీసుకువచ్చి నాటారు. అయితే ఈ గడ్డి విపరీతంగా పెరిగిపోతూ పెంగ్విన్‌లు నివాసం ఉండే ప్రాంతాలను కప్పేస్తోంది.

అంతేకాకుండా ఈ గడ్డిలో చిక్కుకొని ఎటూ కదల్లేక పెంగ్విన్‌లు చనిపోతున్నాయట. గతంలో 40 వేల వరకు ఉన్న ఈ పెంగ్విన్‌ల సంఖ్య ప్రస్తుతం 18 వేలకు చేరుకుంది.

అయితే దీనికి స్థానిక అధికారులు ఒక ఉపాయం ఆలోచించారు. పెంగ్విన్‌లను రక్షించ డానికి ఆవులను రంగంలోకి దించారు. గడ్డిని ఆవులు మేసేయడంతో పెంగ్విన్‌లకు కష్టాలు తప్పుతున్నాయట.

## పేలిపోయిన విమాన టైరు..



జైపూర్: స్పైస్ జెట్ విమాన టైరు పేలిపోవడంతో ఈ విషయాన్ని గుర్తించిన విమానాశ్రయ సిబ్బంది, పైలట్.. అన్ని జాగ్రత్తలు తీసుకుని దాన్ని విమానాశ్రయంలో సురక్షితంగా దించిన ఘటన రాజస్థాన్‌లోని జైపూర్ ఎయిర్‌పోర్టులో చోటు చేసు కుంది. అందులోని ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారని అధికారులు ప్రకటించారు. ఆ సమ యంలో విమానంలో మొత్తం 189 మంది ఉన్నారని చెప్పారు. ఈ విమానం దుబాయ్ నుంచి జైపూర్ చేరుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై స్పైస్ జెట్ ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ... "జైపుర్‌లో ఆ విమానం దిగాల్సిన సమయంలో ఇక్కడి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు ఆ విమాన టైరు పేలిపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై పైలట్‌తో మాట్లాడారు. ఆ విమానాన్ని సురక్షితంగా జైపూర్ విమానాశ్రయంలో దించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు" అని తెలిపారు.ఆ విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా దిగారని, ఎవరికీ ఏమీ కాలేదని అధికారులు తెలిపారు. విమాన టైరు పేలిన కారణాలను ఇంజినీర్లు పరిశీలిస్తున్నారు. కాగా, గతేడాది ఫిబ్రవరీ 9న కూడా ఓ స్పైస్‌జెట్ విమాన టైరు పేలిన ఘటన వెలుగులో కొచ్చింది. 200 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమాన టైరు పేలడంతో చెన్నై విమానాశ్రయంలో దాన్ని అత్యవసరంగా దించారు. ఆ సమయంలోనూ ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.

## జూలై 15న చంద్రయాన్ -2 ప్రయోగం



న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూన్ మిషన్.. చంద్రయాన్-2 ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. 2019 జూలై 15న ప్రయోగం చేపడతామని ఇస్రో ఛైర్మన్ డా. కె.శివన్ ప్రకటించారు. ఈ ప్రయోగానికి రూ. 1000 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. జూలై 15 తెల్లవారు జామున 2 గంటల 51 నిమిషాలకు చంద్రయాన్-2 ప్రయోగాన్ని నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ మార్క్-3 వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం చేపడతామని పేర్కొన్నారు. దీని ద్వారా చంద్రగ్రహంపైకి ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను ప్రవేశపెట్ట నున్నారు. ల్యాండర్‌కు విక్రమ్ అని, రోవర్‌కు ప్రగ్యాన్ అని నామకరణం చేశారు. చంద్రయాన్-2 వ్యవస్థ మొత్తం బరువు 3,447 కేజీలు కాగా, వీటిలో ఒక్క ప్రొపెల్లర్ బరువే ఏకంగా 1,179 కేజీలు ఉంటుందని చెప్పారు. ఓసారి ఉపగ్రహాన్ని ప్రయోగించాక, ఇది స్వతంత్రంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతుందని తెలిపారు.

2019 సెప్టెంబర్ 6 లేదా 7 తేదీల్లో ల్యాండర్ చంద్రుడిపై దిగుతుందని వెల్లడించారు. ఈ ప్రయోగం విజయవంతం కోసం దశాబ్దాలుగా భారత శాస్త్రవేత్తలు కృషిచేస్తున్నారు. ఈ ప్రయోగం తర్వాత లభించే సమాచారం ఆధారంగా ఇస్రో తదుపరి తన వ్యూహాలను అమలు చేయనుంది.

## 'మేము ప్రేమలో పడ్డాం'
### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్



వాషింగ్టన్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ నుంచి మరో అందమైన ఉత్తరాన్ని అందుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అణ్వాయుధాలను వదిలిపెట్టే అంశంపై ఎలాంటి పురోగతి లేనప్పటికీ కిమ్ మాట మీద నిలబడతారన్న నమ్మకం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే లేఖలో కిమ్ ఏమి రాశారన్నది బయట పెట్టలేదు. గతంలోనూ కిమ్ రాసిన లేఖను అందమైనదిగా అభివర్ణించిన ట్రంప్.. తామిద్దరం ప్రేమలో ఉన్నమన్నారు. కొరియా ద్వీపాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కిమ్‌తో ట్రంప్ రెండుసార్లు సమావేశమైనప్పటికీ.. ఉత్తర కొరియా ఈ అంశంపై తమ వైఖరిని మార్చుకునేలా కన్పించడంలేదని అమెరికా నిఘా వర్గాలు తెలిపాయి.

## 40 వేల ఏళ్లనాటి ఓ రాకాసి తల..



సైబీరియా : 40 వేల ఏళ్ల నాటి ఓ రాకాసి తోడేలు తలను శాస్త్రవేత్తలు గుర్తించారు. మెదడుతో సహా రాకాసి తోడేలు తలలోని ఇతర భాగాలు పెద్దగా పాడవకుండా ఉండటం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ రాకాసి తోడేలు తల పరిమాణము మ్రాములు తోడేళ్ల తల 9 అంగుళాలు ఉంటే ఈ రాకాసి తల దాదాపు 16 అంగుళాల పొడువు ఉంది.

## కవి సమయం

### నేనంటా!

మానవజన్మ
చాలా ఉత్కృష్ఠమైనది
మహోన్నతమైనదని
దైవత్వాన్ని ధ్యానించే
ఒకే ఒక్క జీవి-మానవప్రాణి
అని విజ్ఞులు అంటారుసుమా!
అంత నీచమైన -నికృష్ఠమైన
పాపిష్ఠి జన్మ ఇంకొక్కటి లేదంటా!
నేనంటా! ...॥అందరు॥
తెల్లవారి ప్రొద్దుకునికేదాకా!
దనదాహమే ధ్యేయంగా
పాపకృత్యాలు చేస్తూపోయె
జన్మేగదా!
కుల్లు-కుదంత్రాలు-కుట్రలు
ఎదుటవాడు చెడితే బాగుపడతానన్న
జన్మేగదా!
నేనంటా!
...॥అందరు॥
ఏ పాపకృత్యాలు చెయ్యని
మహోన్నతమైన జన్మ
వృక్షజన్మ
కూటికోసం-కోటివిద్యలు
మానవజన్మ
ఏ విద్య లేక బ్రదికేది
వృక్ష జన్మగదా!
ప్రతీ విద్యలో మాయ-మర్మం చేసేది
మనిషేగదా!
వినికిడి-చూపు-కదిలికలేనిజీవి
వృక్షమే గదా!
ఆకలికి- ఆలోసించి
పరుగులు-నడకలు
కుల్లు-కుదంత్రాలు చెయ్యివల్సిన
పనిలేదు
ఉపకారమే తప్పా! అపకారం
చెయ్యని జన్మ
- వృక్షజన్మ

...రచయిత
ఎల్.సిద్ధు

## పంచాంగం

| మాసం : జ్యేష్ఠ; తిథి : ఏకాదశి సా.5.32; చిత్ర ప.12.05; సా.వ.5.27ల 7.00 | గురువారం 13-06 -2019 |
|---|---|

**మేషం** : అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందుతుంది. రాజకీయ నాయకులకు అనుకూలం. నూతన వ్యాపారములు చేయువారికి అనుకూలించును. ఆరోగ్యం బాగుంటుంది. పాత సన్నిహితులను కలుసుకుంటారు.

**వృషభం** : దూర ప్రయాణములు చేస్తారు. దర్ఘీరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. పెద్దల సహకారం కలుగును. శరీర ఒత్తిడి అలసట ఎక్కువగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది. సమయానికి నిద్ర, భోజనం ఉండదు. పెద్దల సహకారం కలుగును.

**మిథునం** : దూరపు బంధువులతో ఇష్టాగోష్ఠి చేస్తారు. నూతన సినీ రంగంలో ప్రవేశించు వారికి గుర్తింపు కలుగుతుంది. ఉద్యోగులకు పై అధికారుల ఒత్తిడి కలుగుతుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం బాగుండును.

**కర్కాటకం** : వృత్తి వ్యాపారాలు చేయువారు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక, దైవ, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. మీ బాధ్యతలు ఇతరులకు అప్పగించవద్దు. ఎంత సంపాధించినా ధనం నిలబెట్టలేకపోతారు. మీ ప్రత్యర్థుల విషయంలో అప్రమత్తంగా మెలగండి. సహోద్యోగులు మనసు తెలిసి వ్యవహరిస్తారు.

**సింహం** : ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. కష్టమైన పనులన్నింటిని దిగ్విజయంగా పూర్తిచేస్తారు. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుంబీకులు మీ అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయలు, చిరు వ్యాపారులకు పురోభివృద్ధి.

**కన్య** : బంధుమిత్రులను కలుసుకుంటారు. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనస్సుకు ఆనందం కల్గించే పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఆర్థికంగా లాభం. ప్రియతముల వైఖరిలో మార్పు, ఆనందం కలుగుతుంది.

**తుల** : బంధువుల ఆకస్మిక రాక మీకు ఎంతో ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఏదన్న అమ్మకానికి చేయు ప్రయత్నాలలో సఫలీకృతులు కాగలరు. నిరుద్యోగులకు సదవకాశాలు లభించినప్పటికిని వాటిని సద్వినియోగం చేసుకొలేకపోతారు. ఓర్పు పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. పొదుపు ఆవశ్యకతను గుర్తిస్తారు.

**వృశ్చికం** : రిటైల్, రియల్ ఎస్టేట్ రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. మీరు మార్పు కోసం ఆరాటపడతారు. కొత్త ఆలోచనలు మీ మదిలో మెదులుతుంటాయి.

**ధనుస్సు** : బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల అవసరం. పెద్దల ఆరోగ్యము గురించి ఆందోళన చెందుతారు. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రైవేటు సంస్థలలోని వారికి పనిభారం అధికమవుతుంది.

**మకరం** : వృత్తి వ్యాపారాలకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ప్రముఖ వ్యక్తులను కలుసుకుంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. మిత్రులను కలుసుకుంటారు. సోదరీ, సోదరులతో ఏకీభవించలేరు. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించునప్పుడు మెళుకువ అవసరం.

**కుంభం** : బ్యాంకుల ఆర్థిక సంస్థలతో వాయిదా పడతాయి. స్త్రీలు టి.వి.ఛానెళ్ళ కార్యక్రమాల్లో రాణిస్తారు. విద్యార్థుల్లో మనోధైర్యం, ఏకాగ్రత నెలకొంటాయి. దూర ప్రయాణాలు, పుణ్యక్షేత్రాల సందర్శనలకు పథకాలు రూపొందిస్తారు. మీ అలవాట్లు, బలహీనతలు గోప్యంగా ఉంచటం క్షేమదాయకం. ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది.

**మీనం** : వృత్తి పరమైన సమావేశాలకు అనుకూలం. లక్ష్యసాధనకు మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాలవారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దీక్షా, పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధిస్తారు. వ్యాపారాల్లో భాగస్వామి సహాయ సహకారం లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. రుణయత్నాల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కుంటారు.

# బాబాను దర్శించిన యోగులు

### సంకీర్తన



శ్రీ నారాయణ స్వామీజీ మహరాజ్

ఆ టేప్ రికార్డర్‌లోనుంచి ఒక గంభీర స్వరంతో ఉపన్యాసం ఆరంభమయింది. ఆ ఉపన్యాసకుడు ముందుగా ఈ వర్తమాన యుగంలో భక్తిని విశేషంగా ప్రచారం చేస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి వినయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేశాడు. రామ, కృష్ణ, శివ మున్నగు దివ్యనామములు విలువను, శక్తిని కోల్పోయియున్న స్థితిలో భగవాన్ బాబావారు అవతరించి ఆ పవిత్ర నామాలను దివ్యశక్తితో మరల ఛార్జ్ చేశారు అంటూ అద్వైతవేదాంతం గురించి చెప్పాడు.ఆ ఉపన్యాసకుడు ఆ విధంగా శ్రీసత్యసాయి బాబావారిని మనసారా ప్రశంసించటం విన్న, రామరాజుగారికి ఎంతో ఆనందం కలిగింది. ఆ ఉపన్యాసకుడు ఉత్తర భారతదేశంలో ఎంతో ప్రఖ్యాతి గడించిన హరిద్వారఋషి యుగపురుష పరమానందజీ మహరాజ్. ఓహో ఈ మాటలు వినటం కోసమే కాబోలు స్వామి నన్ను బదరీయాత్రకు వెళ్ళకుండా ఆపింది అనుకున్నారు రామరాజుగారు. బదరీయాత్ర ఆగిపోవటము, యాదృచ్ఛికంగా ఈ హిమాలయ ఆశ్రమానికి రావటము, ఇక్కడి హరిద్వార్, హృషీకేశ్ ఋషులు బాబావారిని ఆరాధనా భావంతో స్తుతించటము- ఇదంతా బాబా తన కోసం చేసిన ప్రేమపూర్వకమయిన లీలగా ఆయనకు అనిపించింది!

రామరాజుగారు నారాయణస్వామి మహరాజ్‌తో "అయ్యా! ఈ మధ్య బాబావారు నాతో మాట్లాడటమే లేదు. నా పై వారికి కోపం వచ్చిందేమో అనిపిస్తున్నది. అది నా మనస్సుఓ తీరని బాధగా ఉంది" అన్నారు. అప్పుడు ఆ యోగి పుంగవుడు "బాబా వారికి ఎంత మాత్రం కోపం ఉండదు. అలా ఉంటారు అంతే. దివ్యత్వాన్ని ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదు. బాబా ప్రతిరోజు తనను శరణువేడిన కొన్నివేల మందితో వ్యవహరిస్తూ ఉంటారు. రూపరహితుడు, అపరిమితుడు అయిన పరమాత్మ ఒక రూపాన్ని ధరించి వచ్చినప్పుడు ఆయనకు కొన్ని పరిమితులు ఉంటాయి. మనకు ఎలాగో ఆయనకు కూడా ఉన్నది రోజుకు ఇరవైనాలుగు గంటలే. ఈ ఒక్కనితోనే ఎక్కువ గంటలు గడపటానికి ఆయనకు సమయం ఎక్కడ ఉన్నది? అందువల్ల ఆయన నా ద్వారా నీతో మాట్లాడుతున్నారు అని గ్రహించు. ఆయన నీలో నాలోను కూడా ఉన్నారు. నీవు నేను కూడా పరబ్రహ్మ స్వరూపలమే. తారతమ్యమే లేదు" అంటూ నారాయణస్వామి మహరాజ్ రామరాజుగారి పాదాలకు నమస్కరించారు! రామరాజుగారు ఒక్కసారి ఆశ్చర్యపడి కన్నీరు పెల్లుబుకుతుండగా ఆయనను వారించారు. ఇది బాబా చేసిన లీలయే అని ఆయనకు అనిపించింది. అనారోగ్యం అనే వంకతో తన బదరీ ప్రయాణాన్ని ఆపి ఈ ఋషి ద్వారా బాబా నాకు ఈ పాఠం చెప్పించారన్న మాట అనిపించింది వారికి. రామరాజుగారు నారాయణస్వామి మహరాజ్ వారిని మరొక ప్రశ్న అడిగారు "అయ్యా! భగవాన్ బాబా అద్వైతాన్ని ప్రబోధిస్తారు. తాను భగవంతుడినని ప్రకటిస్తారు, మళ్ళీ ఆయన స్వయంగా రకరకాల దేవళ్ళమీద భజనపాటలు పాడి మనచేత పాడిస్తారు.



బాజ్జి

... సశేషం

# భీమిలి చిల్డ్రన్స్ హోంలో అవంతి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



భీమునిపట్నం: భీమునిపట్నం స్థానిక చిల్డ్రన్స్ హోంలో భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే ,మంత్రి వర్యులు అవంతి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఎస్ ఓ ఎస్ లో చిన్నపిల్లలు మధ్య ఘనంగా జరిగింది. ఇందు లో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ కరుణాకర్ రెడ్డి ,కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు నాడే ఎమ్మెల్యే గా ప్రమాణ స్వీకారం చేయడం అరుదైన విషయం మని .ఇలాంటి అదృష్టం దేవుడు ఇచ్చిన వరం అని నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.ఇలాగే ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా సేవలు అందించి ఆయన వంద.సంవత్సరాలు పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు చిల్ల భాస్కర రెడ్డి, అల్లిపల్లి నర్సింగరావు, జీరు వెంకటరెడ్డి, వాసుపల్లి కొండబాబు, మైలపిల్లి లక్ష్మణ రావు, గుండాసు మధు నాయుడు , అల్లిపిల్లి కోదండ, కర్రోత నాగేంద్ర, యెచ్చర్ల హరి, అప్పారావు, ఎర్రయ్య రెడ్డి, ,ప్రకాష్, చెల్లూరి. గౌరి నాయుడు, బాకీ రమణారెడ్డి,. అర్ ప్రభాకర్ నాయుడు, వంశీ,తదితర నాయకులు, అవంతి కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# భీంపోలు పంచాయతీలో ఘోర రోడ్డు ప్రమాదం, ఒకరు మృతి



అనంతగిరి, మండలంలో గల భీంపోలు పంచాయతీలో వేద ఎస్టేట్ సైట్ వద్ద ఎశీశ్రీవతీశీ పిక్ అప్ వాహనం నెంబర్ ఏపీ 0 41206 , గా తెలిసి యున్నది మో టార్ సైకిల్ ను ఢీ,కొనగా సిరా అనిల్ అనే మోటార్ సైకిల్ పై వెలుతున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు, సిరా అనిల్ బిల్లకోట గ్రామం వద్ద చంపావతి నదిపై బ్రిడ్జి పనివద్ద జేసిబి ఆపరేటరుగా పనిచేస్తున్నట్లు గా తెలుస్తున్నది బొలేరా వాహనం దొండవలస రోడ్డు పనిచేస్తున్నవారిది, ఈరోజు సిరా అనిల్ కుమారుడు పుట్టినరోజు అని కొడుకు పుట్టినరోజు కార్యక్రమం నకు వెలుతుండగా తిరిగి రాని లోకాలకు వెల్లిపోవడం చూపరులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అక్కడ వారు వాపోతున్నారు.

# సదా మీ'సేవ'లో హలోగురూ ధృవీకరణపత్రాలు మీసేవలో జారీ

పరవాడ: నూతనవిద్యాసంవత్సరము ప్రారంభము అయ్యింది. ప్రభుత్వము నుంచి రాయితీలుఅందుకునే విద్యార్దులు చాలామంది ఉన్నారు.వీరుందరికీ పలు సర్టిపికెట్లు అవసరము అవుతాయి. ప్రాదమిక పాఠశాలవదిలి ఉన్నతపాఠశాలో ప్రవేశము పొందేవారు, కళాశాలలో ప్రవేశం పొందేవారు, ఉపకారవేతనాలుకుఅర్హులైనవారు కుల,నివాశ, ధ్రువీకరణపత్రాలను దరఖాస్తుతో పాటు వీటన్నింటిని మీసేవాలోపొందాలి. చాలామంది విద్యార్దులు గడువు సమీపించేటప్పుడు హడావుడి పడుతూ ఉంటారు.ముందుస్తుగానే మనకు కావాల్సిన పత్రాలుతీసుకుంటే మంచిది. మనకుకావాల్సిన పత్రాలు ఈవిదంగా పొందాలి. కులధ్రువీకరణపత్రంపొందాలంటే అదార్ కార్డు,చిరునామా, కుటుంబసభ్యులుకు సంబందించి కులధ్రువీకరణపత్రం, విద్యాసంస్దలు జారీచేసిన టిసినకలుజతచేసి దరఖాస్తుచేసుకోవాలి.సంభందిత దరఖాస్తును విఅర్వో,అర్ ఐ,ఎమ్ అర్ ఓ పరిశీలించి ధ్రువీకరిస్తారు.అనంతరము అపత్రాన్ని అన్ లైన్ లో అనుమతిస్తారు.మీ సేవాలోసర్టిపికెట్ తీసుకోవాలి.ఈబిసి సర్టిపికెట్ పొందాలంటే అర్దికింగావెనుకబడినవర్గాలువారు కూడా మీసేవలోదరఖాస్తుచేసుకోవాలి.కాపు,రెడ్డి,వైశ్య ,బ్రహ్మణతథితరకులాలవారికి ఈసర్టిపికెట్ అవసరముఅవుతుంది.దీని కోసం అదార్ ,రేషన్ కార్డు,చిరునామా తెలియజేసే పత్రాలును ధరఖాస్తుకుజతచేయాలి. ఈపత్రం ఉంటే ఉపకారవేతనాలు పొందోచ్చు.ఒబిసి సర్టిపికెట్ పొందాలంటే ధరఖాస్తుతో పాటుకులాన్ని నిర్దారించే సాక్షంతో కూడిన పత్రంజతచేయాలి.వీటితో పాటుఅదార్ ,అదాయదృవీకరణ పత్రం,రేషన్ కార్డు,విద్యాఅర్హతపత్రాలును జతచేయాలి. అదాయదృవీకరణపత్రంపొందాలంటే దరఖాస్తుతోపాటుఅదార్ ,రేషన్ ,గుర్తింపుకార్డు పత్రాలుజతచేయాలి.వివరాలును అన్ లైన్ లో మీసేవసిబ్బందినమోదు చేసి తహశీల్దార్ కార్యలయానికిపంపుతారు.అక్కడ అదికార్లు విచారించి అర్హులైనవారికి సర్టిపికెట్ మంజూరు చేస్తారు.

నివాశదృవపత్రంపొందాలంటే విద్యఅర్హత పత్రం,చిరునామాపత్రం,గుర్తింపు కార్డులును దరఖాస్తుకాపీకి జతపరచాలి.అన్ని సక్రమంగాఉంటే సర్టిపికెట్ జారీచేస్తారు. దళారులును అశ్రయించాల్సినవనిలేదు సర్టిపికెట్స్ కోసము మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి.దళారులును అశ్రయించాల్సిన పనిలేదు.అవసరమైన పత్రాలును జతచేసి దరఖాస్తుచేస్తే నిర్ణీతగడువులు అందుతాయి. హలోగురూ ధ్రువీకరణపత్రాలుకోసము మీసేవ కేంద్రాలును అనుసరించండి.మీకు కావాల్సిన ధ్రువీకరణపత్రాలును పొందండి.

# పాల రైతులకు పెట్టుబడి నిధిగా ఏరువాక పథకంలో బోనస్ పంపిణీ



నర్సీపట్నం: నర్సీపట్నం మండలం గబ్బాడ పాల ఉత్పత్తిదారుల సంఘంలో ఖరీప్ ప్రారంభమైనందున పాల రైతులకు ఏరువాక పథకంలో బోనస్‌లను పాల సంఘం అధ్యక్షురాలు పి.గంగాభవానీ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన సూపర్‌వైజర్ ఏసుబాబు మాట్లాడుతూ పాడి రైతులకు విశాఖ డెయిరీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. జనశ్రీ బీమా పథకంలో 30వేల నుండి లక్ష రూపాయలకు పెరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో రుత్తల సన్నిబాబు, పారుపల్లి వరాలు, అనిమిరెడ్డి రాంబాబు, సొసైటీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ, హెల్పర్ గంగునాయుడు పాల్గొన్నారు.

# సత్యదేవున్ని దర్శించిన శివ స్వామీజీ



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని కృష్ణాజిల్లా విజయవాడ నగరానికి చెంది శివ స్వామీజీబుధవారం శ్రీ స్వామివార్ని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో ఎం.వి.సురేష్ బాబు,ఏసి ఈరంకి.జగన్నాధరావు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో సురేష్ బాబు స్వామివారి శేష వస్త్రము, ప్రసాదమును,స్వామివారి జాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరంలో ఘనంగా వాసవీ మాత విగ్రహ ప్రతిష్ఠ







అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం మెయిన్ రోడ్డులోని ఆంధ్రాబ్యాంక్ సమీపంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు లలితా బ్రాండ్ రైస్ అధినేత మట్టే.సత్యప్రసాద్ గారి ఆర్దిక సహకారంతో బుధవారం ఉదయం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి నూతన ఆలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది.ముందుగా ధ్వజస్తంభం పతిష్టాపన మరియు ఆలయ కలశ ప్రతిష్ట నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అన్నవరం దేవస్థానం ఈవో యం.వి.సురేష్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి వాసవిమాత అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వాసవి క్లబ్ సభ్యులు,వనితా క్లబ్ సభ్యులు మరియు ఆర్యవైశ్య సోదరులు, మహిళలు,గ్రామస్థులు,అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# అందుబాటులో విత్తనాలు



గొలుగొండ: ఖరీప్ 2019 సీజన్‌కు గాను వరి విత్తనాలు సరఫరా చేయుటకు సిద్దంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆ యన మాట్లాడుతూ చోద్యం పిఎసిఎస్ నందు ఇవి సిద్దంగా ఉన్నాయన్నారు. 180 క్వింటాళ్లు ఆర్‌జెఎల్ 2537(720 బస్తాలు), మన గ్రోమోర్ కేడిపేట నందు 100 క్వింటాళ్లు ఆర్‌జిఎల్ 2537(400 బస్తాలు), ఎంటియు 1161 33 క్వింటాళ్లు 203 బస్తాలు, ఎంటియు 1064 30 క్వింటాళ్లు(100 బస్తాలు), ఎంటియు 1075(30 క్వింటాళ్లు 100 బస్తాలు), ఎంయుటి 1156 27 క్వింటాళ్లు (90 బస్తాలు) వచ్చాయని తెలిపారు. సబ్సిడిపై వచ్చిన విత్తనాలను రెండు మూడు రోజుల్లో సరఫరా చేస్తామన్నారు. గొలుగొండ నుండి మాత్రమే కాకుండా కేడిపేట గ్రోమోర్ నుండి కూడా విత్తనాలు సరఫరాచేయడం జరుగుతుందని తెలిపారు. సీడ్ విలేజ్‌గా గాదంపాలెం గ్రామం ఎంపిక చేయడం జరిగిందన్నారు. గాదంపాలెం గ్రామానికి ఎంటియు 1064 ఫౌండేషన్ సీడ్ 25 ఎకరాలకు రావడం జరిగిందన్నారు.

# విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్ బుధవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కళావతి పాల్గొన్నారు.

# ప్రత్యర్థులు కలిసిన వేళ

దిల్లీ: ఎన్నికల రణరంగంలో నువ్వా? నేనా? అన్నట్లు తలపడి, ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ బుధవారం సమావేశమయ్యారు. మరో ఎనిమిది నెలల్లో దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వారి సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సమయంలో ఆమె వెంట కొంతమంది కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి ఇంట్లో సమావేశమైన వారు దేశ రాజధానిలో నెలకొన్న కరెంటు, నీటి సమస్యలపై చర్చించారు. దిల్లీ ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలు తీర్చకుండా, ప్రజలను మభ్యపెడుతుందంటూ కేజ్రీవాల్ ప్రభుత్వం మీద షీలా దీక్షిత్ గత శనివారం విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఆరు నెలల కాలానికి ప్రజల కరెంటు బిల్లులు మాఫీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన షీలాను గద్దె దింపి, 2013లో అరవింద్ కేజ్రీవాల్ దిల్లీ ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దిల్లీలో పొత్తు కోసం కాంగ్రెస్, ఆప్ మధ్య అనేక తర్జనభర్జనలు జరిగి చివరకు ఎలాంటి పొత్తు లేకుండా ఇరు పార్టీలు ఎన్నికల బరిలో దిగాయి. అయితే భాజపా దేశ రాజధానిలోని ఏడు పార్లమెంటరీ స్థానాలు గెలుచుకొని, విజయ ఢంకా మోగించింది.

# పారిశుద్ధ్యం పనులు పరిశీలించిన కలక్టర్ మురళీధర రెడ్డి

**ఉదయం 6గం॥లకే నగరంలో పర్యటన**



కాకినాడ : వర్షా కాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులనుండి ప్రజారోగ్యం కాపాడేందుకు పారిశుద్ధ్యం మెరుగు పరచాలని జిల్లా కలక్టర్ మురళీధరరెడ్డి సూచించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వైద్య, ఆరోగ్య, పంచాయితీ రాజ్, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లలో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు జరపాలని,పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని ఆదేశించారు.దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ పారిశుద్ధ్య పనులను స్వయంగా పరిశీలించారు. బుధవారం ఉదయం 6గం॥లకు నగరపాలక సంస్థ కమీషనర్‌తో కలసి నగరంలో అంటు వ్యాధులు ప్రభలే ప్రాంతాల్లో అవగాహన కల్పించడానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు.దుమ్ములపేట,పర్లోపేట లలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.దుమ్ములపేటలోని రాజీవ్ గృహకల్పలో మంచినీటి సరఫరాపై కుళాయి వద్ద మహిళలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుగా ఉండాలని ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా మహిళలో మాట్లాడుతూ పారిశుద్ధ్యంపట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలని,అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.గత సం॥రం ఇదే ప్రాంతంలో 7 డెంగ్యూ కేసులు నమోదయ్యాయని,ఇటువంటి వ్యాధులు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి విల్వలు లేకుండా చూడాలని కలక్టర్ సూచించారు.సీజనల్ వ్యాధుల పట్ల పట్టణ మహిళ స్వయం శక్తి సంఘాలు తమ సంఘంలోని సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.పారిశుద్ధ్యం, పరిశుభ్రతలపై అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేయాలని మున్సిపల్ అదికారులకు సూచించారు.అనంతరం పర్లోపేటలో పారిశుద్ధ్యం పనులను పరిశీలించి మురుగును తొలగించాలని అధికారులకు సూచించారు.పర్లోపేటలో నిర్మాణంలో ఉన్న పట్టణ గృహ సముదాయాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.రమేష్ అదనపు కమీషనర్ సిహెచ్.నాగనరసింహరావు,ఇన్‌చార్జిడిఎంఅండ్ హెచ్ఓ టిఎస్ఆర్ మూర్తి,మున్సిపల్ ఎస్ఇ.బి.రామకృష్ణ,మెప్మా పీడీ ఉమామహేశ్వరరావు, వైడీ రామారావు,ఆల్ఈజ్‌వెల్ సొసైటీ ప్రెసిడెంట్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు కిడ్నాప్ కేసు సుఖాంతం



గాజువాక: కుమారుడు కిడ్నాప్ అయ్యాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోనికి దిగిన గాజువాక పోలీసులు కేసును చేధించారు. నిందుతుని అదుపులోనికి తీసుకొని బాలుడుని తల్లి వద్దకు చేర్చారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....గాజువాకపోలీస్ స్టేషన్ పరిధి డ్రైవర్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన వినయ్‌కుమార్, లక్ష్మి దంపతులకు మూడెళ్ల కుమారుడు తేజ ఉన్నాడు. దంపతుల మధ్య తరచూ కలహాల కారణంగా భర్తకు దూరంగా లక్ష్మి గాజువాకలో నివాసరం ఉంటుంది. భర్తవినయ్‌కుమార్ బెంగుళూరులో ఒక ప్రవేట్ కంపినీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్యకు ఎన్నిసార్లు కాపురానికి రమ్మన్నా రాకపోవటంతో అప్పలరాజు అనే వ్యక్తితో ఈ నెల 6వ తేదీన డ్రైవర్స్‌కాలనీ ఇంటిముందు ఆడుకుంటున్న బాలుడిని అపహరించడంతో తల్లి గాజువాక పోలీసులను ఆశ్రయించింది. దీంతో గాజువాక పోలీసులు రంగంలోకి సిసి పుటేజ్ ఆదారంగా నిందుతుని అదుపులోనికి తీసుకొని బాలుని తల్లికి అప్పగించారు. కన్నతండ్రే అపహరణకు కారణమని, తండ్రిపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ధరఖాస్తుల స్వీకరణ

అమలాపురం : అమలాపురం రూరల్ మండలం సమనస బిసి గురుకుల పాఠశాల మరియు కాకినాడలోని కరప బిసి గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతుల్లో ప్రవేశానికి గాను ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమనస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి. పెద్దబ్బాయి తెలిపారు. 2019-2020 విద్యా సంవత్సరానికి గాను ఈ ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం చదువుతున్న విద్యార్థులు మాత్రమే ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ఆయా గురుకుల పాఠశాలల్లో పూర్తి చేసిన ధరఖాస్తులు సమర్పించాలనీ, అదేవిధంగా ప్రవేశ పరీక్ష కూడా విద్యార్థులు ఎంచుకున్న ఆయా గురుకుల పాఠశాలల్లోనే జరుగుతాయని ఆయన వివరించారు. ప్రవేశ పరీక్షలు ఈనెల 22వ తేదీన జరుగునని ప్రిన్సిపాల్ టి. పెద్దబ్బాయి తెలిపారు.

# రుణమాఫీ చేయకుండా కొత్త పథకమెందుకు?

## తెదేపాను ప్రశ్నించిన మంత్రి కన్నబాబు



అమరావతి: రైతుల సంక్షేమానికి వైకాపా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ వ్యవసాయ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. తెదేపా ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన విమర్శించారు. సచివాలయంలో కన్నబాబు మీడియాతో మాట్లాడారు.

రైతుల కోసం తెచ్చిన రుణాలను గత ప్రభుత్వం ఇతర అవసరాలకు కేటాయించిందన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ సరిగా అమలు చేయలేదని.. గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు ఇప్పుడు రైతు సంక్షేమం గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుతున్నారని వ్యాఖ్యానించారు. రుణమాఫీ పేరిట ఐదేళ్లపాటు రైతులను తెదేపా ప్రభుత్వం మోసం చేసిందని..

సుమారు రూ.2వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వలేకపోయారన్నారు.

రైతులకు ఇస్తామన్న రూ.24వేల కోట్ల రుణాలను మాఫీ చేయకుండా.. బాండ్లు ఇచ్చి చేతులు దులుపుకొని అన్నదాత సుఖీభవ కింద కొత్త పథకాన్ని ఎందుకు తీసుకొచ్చారు? రుణమాఫీ మొత్తాన్ని చెల్లించవచ్చు కదా? అలా చేయకుండా కొత్త పథకాన్ని తీసుకొచ్చి రైతులను ఎందుకు మోసం చేయాలనుకున్నారు?

ఎన్నికల ముందు ఓట్ల కోసం కాదా? అని కన్నబాబు దుయ్యబట్టారు. రైతులు, మహిళలను చంద్రబాబు అనేక విధాలుగా మభ్యపెట్టారని ఆయన ఆరోపించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఇచ్చే సాయాన్ని ఆపేస్తున్నామంటూ తెదేపా విమర్శిస్తోందని.. రైతులు కష్టాల్లో ఉన్నారని భావించి ఈ అక్టోబర్‌లోనే వైఎస్సార్ రైతుభరోసాను ప్రారంభిస్తున్నామని చెప్పారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినదానికంటే ఏడాది ముందే రైతుభరోసాను అమలు చేస్తున్నామని కన్నబాబు వివరించారు.

# ప్రణయ్ హత్యకేసు చార్జిషీటు దాఖలు



నల్గొండ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ హత్యకేసులో మిర్యాలగూడ పోలీసులు జిల్లా కోర్టులో బుధవారం చార్జిషీటు దాఖలు చేశారు.

మొత్తం 102 మంది సాక్షులను విచారించిన పోలీసులు 1600 పేజీలతో చార్జిషీటు, 63 పేజీల్లో విచారణ నివేదిక కోర్టుకు సమర్పించారు. తమ కూతుర్ని ప్రేమ వివాహం చేసుకున్నాడన్న అక్కసుతో ప్రణయ్‌ను అమృత తండ్రి తిరునగరు మారుతీరావు దారుణంగా హత్యచేయించిన సంగతి తెలిసిందే.

(ప్రణయ్ హత్య కేసు నిందితులు బెయిల్‌పై విడుదల) ఈ ఘటన గతేడాది సెప్టెంబర్ 14న మిర్యాలగూడ పట్టణంలో పట్టపగలే జరిగింది. ప్రణయ్ హత్యకేసులో అరెస్టయిన నిందితులు మారుతీరావు, అతని తమ్ముడు శ్రావణ్, మరొక నిందితుడు కరీంపై గతేడాది సెప్టెంబర్ 18న పోలీసులు పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించగా...

ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. ఇక ఈ ముగ్గురితోపాటు మరో ఐదుగురి పేర్లను కూడా పోలీసులు చార్జిషీటులో చేర్చారు. హత్యజరిగిన 9 నెలల అనంతరం చార్జిషీటు దాఖలు చేయడం గమనార్హం.

# ఆ యాడ్స్‌చిరాకు తెప్పిస్తున్నాయి: సానియా



న్యూఢిల్లీ: చాలా కాలం తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, ఈ నేపథ్యంలో ఇటీవల వచ్చిన పలు టీవీ యాడ్‌లపై భారత టెన్నిస్ స్టార్ సానియా మిర్జా అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిహద్దుకి అటు.. ఇటు.. ఇరు ప్రాంతాల్లో చిరాకు తెప్పించే ప్రకటనలు వస్తున్నాయి. సీరియస్‌గా చెబుతున్నాను. ఈ మ్యాచ్‌కు మీరు మరింత ప్రచారం కలిగించాల్సిన అవసరం లేదు.. ముఖ్యంగా చెత్త పనులతో. ఈ మ్యాచ్‌పై అభిమానులకు ఇప్పటికే కావాల్సినంతగా శ్రద్ధ ఉంది. ఇది అనూహ్య క్రికెట్ మ్యాచ్. ఇంతకన్నా ఎక్కువ అని మీరు భావిస్తుంటే, మీకు స్వీయ నియంత్రణ అవసరం. అనవసర విషయాలపై శ్రద్ధ పెట్టకండి అని ఆమె ట్వీట్ చేశారు.

కాగా, ఈ ప్రపంచకప్‌లో భాగంగా భారత్-పాక్ క్రికెట్ జట్ల మధ్య జూన్ 16న మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఛానెల్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఓ యాడ్ విడుదల చేసింది. భారత్ ఎలాంటి ప్రణాళికలు రచిస్తుందంటూ వ్యంగ్యంగా దీన్ని రూపొందించిన విషయం తెలిసిందే. భారత వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ వేషధారణలో ఉన్న ఓ వ్యక్తి పలు విషయాలను చెబుతున్నట్లు ఓ వీడియోను రూపొందించింది. మరోవైపు, భారత్‌లోనూ ఓ వీడియో వైరల్ అవుతోంది. అందులో టీమిండియా చేతిలో పాక్ గతంలో ఘోరంగా ఓడిపోయిన తీరును వివరించారు. వీటిపైనే సానియా మిర్జా మండిపడ్డారు.

# దిమాక్ ఖరాబ్ చేస్తది!



నన్ను దోచుకుందువటే చిత్రంతో తెలుగు చిత్రసీమలో అరంగ్రేటం చేసింది కన్నడ కస్తూరి నభానటేష్. చారడేసి కళ్లలో కావాల్సినంత చిలిపిదనాన్ని ఒలికిస్తూ యువ హృదయాల్ని దోచుకుంది. అందం, అభినయం కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సొగసరికి తెలుగులో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. రామ్ సరసన ఇస్మార్ట్‌శంకర్, రవితేజ జోడీగా డిస్కో రాజా చిత్రాల్లో నటిస్తుందీ సుందరి. నభా హాస్యాన్ని పండించే విధానం బాగా నచ్చింది. నన్ను దోచుకుందువటే ట్రైలర్‌లో ఆమె నటనను చూసి డిస్కోరాజా కోసం ఎంపిక చేసుకున్నాం అని ఆ చిత్రబృందం తెలిపింది. నభానటేష్ హుషారైన అమ్మాయి. ఎలాంటి పాత్రలోనైనా మెప్పిస్తుంది. ఇస్మార్ట్‌శంకర్‌లో ఆమె పాత్ర కీలకంగా ఉంటుంది అని చిత్ర ప్రతినిధి పేర్కొన్నారు. ఇస్మార్ట్ శంకర్ చిత్రంలో దిమాక్ ఖరాబ్ అనే లిరికల్ వీడియోలో అందాల ప్రదర్శనతో కుర్రకారుని ఉర్రూతలూగించింది ఈ కన్నడ సోయగం. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.

## చిత్రభాను

# కథలతోనే నా ప్రయాణం



**మంచి పాత్రలు లభిస్తే కామెడీ రోల్స్ చేయడానికి ఎప్పుడూ సిద్ధమే. కేవలం హీరోగా మాత్రమే సినిమాలు చేస్తానని ఎప్పుడూ చెప్పలేదు. హీరోగా మారిన తర్వాత కమెడియన్ పాత్రలు అంగీకరించననే ఆలోచనతో ఎవరూ అవకాశాలు ఇవ్వడం లేదు అని అన్నారు సప్తగిరి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం వజ్రకవచధర గోవింద. అరుణ్ పవార్ దర్శకుడు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా సప్తగిరి పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...**

**వజ్రకవచధర గోవింద నేపథ్యమేమిటి? ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

-వజ్రం చుట్టూ తిరిగే కథ ఇది. ఇందులో గోవిందు అనే దొంగగా నేను కనిపిస్తాను. వజ్రానికి గోవిందుకు ఉన్న సంబంధం ఏమిటి? దాని వల్ల అతడికి ఎదురైన కష్టనష్టాలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. హీరోగా కాకుండా హాస్య నటుడి పంథాలో నా పాత్ర ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ మాదిరిగా ఈ సినిమా పేరుతో పాటు డబ్బును తీసుకొస్తుందనే నమ్మకం ఉంది.

**దర్శకుడు అరుణ్‌పవార్‌తో రెండో సినిమా చేయడానికి కారణమేమిటి?**

-సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సినిమా చేస్తున్నప్పుడు అరుణ్‌పవార్‌తో మరో సినిమా చేస్తానని మాటిచ్చాను. కథకు సరిపోయే దర్శకుడి కోసం అన్వేషిస్తున్న సమయంలో అరుణ్ అయితేనే న్యాయం చేయగలడనిపించింది. తొలి సినిమా సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందని అతడితో ఈ సినిమా చేశాను.

**వినోదాన్ని నమ్ముకునే ఈ సినిమా చేశారా?**

-ఇదివరకు హీరోగా నటించిన సినిమాల్లో నేను సరిగా నవ్వించలేకపోయాననే విమర్శలు వచ్చాయి. కమర్షియల్ హంగులను నమ్మి ఆ సినిమాలు చేశాను. అందుకు భిన్నంగా ఈ సినిమాలో కథతో పాటు వినోదానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాం. ఏడేళ్ల పాటు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయడంతో ఆ ప్రభావం నేను చేస్తున్న సినిమాలపై తప్పకుండా ఉంటుంది. ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశాన్ని చెప్పడానికే ప్రయత్నిస్తాను. ఇందులో క్యాన్సర్ రోగులకు సహాయం చేయాలనే సందేశాన్ని చెప్పాం.

**అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అనుభవంతో మీరు నటించే సినిమాల్లో అవసరమైన సలహాలు ఇస్తుంటారా?**

-కథకు అవసరమైతే సలహాలు ఇస్తుంటాను. నచ్చితే దర్శకులు తీసుకుంటారు. ఒకవేళ వారు తీసుకోకపోయినా బాధపడను.

**హాస్యనటులు హీరోలుగా రాణించలేరనే మాటతో మీరు ఏకీభవిస్తారా?**

-ఆ మాటను నేను నమ్మను. అందరి జీవితాలు ఒకేలా ఉండవు. కథను నమ్ముకునే ప్రయాణాన్ని సాగించాలని అనుకుంటున్నాను. అదే నన్ను హీరోగా ముందుకు నడిపిస్తుందనే నమ్మకం ఉంది. కథ లేకుండా ఏ సినిమా ఆడదు. కథల విషయంలో కరెక్ట్‌గా ఉంటే ఎవరైనా విజయాల్ని అందుకోవచ్చు.

**హాస్యనటుడి ఇమేజ్ హీరోగా నిలదొక్కుకోవడానికి అడ్డొస్తుందని అనుకుంటున్నారా?**

-వందశాతం అడ్డొస్తుంది. తొందరలోనే దానిని అధిగమిస్తాననే నమ్మకం ఉంది.

**దర్శకత్వం వహించే ఆలోచన ఉందా?**

-ప్రస్తుతానికైతే ఆలోచన లేదు. నటనపైనే దృష్టిసారిస్తాను.

**ప్రస్తుతం చేస్తున్న సినిమాలేవి?**

-సప్తగిరికి దయ్యం పట్టింది పేరుతో రెండు కథలను సిద్ధం చేసుకున్నాను. వాటిని తెరపై తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నాను.

ప్రేమకథా చిత్రమ్ తరహాలో ఇవి సాగుతాయి. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న ఓ సినిమాలో హాస్యనటుడిగా కనిపిస్తాను.

## గిరిపుత్రుల పోరాటం



ఆర్య, కేథరిన్ థెరిస్సా జంటగా నటించిన తమిళ చిత్రం కదంబన్ తెలుగులో గజేంద్రుడు పేరుతో అనువాదమవుతున్నది. రాఘువ దర్శకుడు. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రాన్ని లక్ష్మీ వెంకటేశ్వర ఫ్రేమ్స్ పతాకంపై ఉదయ్‌హర్ష తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 21న ప్రేక్షకులముందుకురానుంది. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ తమిళంలో విమర్శకులు ప్రశంసలందుకుందీ చిత్రం. ఓ కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజన పుత్రులుగా నాయకానాయికలు నటించారు. ఆద్యంతం థ్రిల్‌కు గురిచేసే అంశాలతో ఆకట్టుకుటుంది. అడవిని ఆక్రమించుకొని సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మించాలనుకున్న సంఘ విద్రోహ శక్తుల పన్నాగాన్ని గిరిపుత్రులు ఎలా ఆటకట్టించారన్నదే చిత్ర కథ. యువన్‌శంకర్‌రాజా సంగీతం ప్రధానాకర్షణగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది అన్నారు.

## టెర్రరిజమ్ నేపథ్యంలో..



బిట్టు, అపర్ణశర్మ, హిమాన్షి ఖురానా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఏక్. సత్ రుద్రారపు దర్శకత్వం వహిస్తున్నారు. కె వరల్డ్ మూవీస్ పతాకంపై హరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఇటీవల హైదరాబాద్‌లో దర్శకుడు అజయ్ భూపతి ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ టెర్రరిజమ్ నేపథ్యంలో రూపొందించిన చిత్రమిది. ఇటీవల పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన అమరవీరులకు అంకితం చేస్తున్నాం. మంత్ర ఆనంద్ అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దేశభక్తి ప్రధానంగా సాగే ఈ చిత్రంలో అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ వున్నాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని ఈ నెల 14న విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నాం అన్నారు. సుమన్, బెనర్జీ, పృథ్వీ, శ్రవణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: చక్రవర్తి, రచయిత, నిర్మాత: హరి.

# విద్యాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు

## అరకు యంపీ మాధవి



అరకు: విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అరకులోయ పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి చెప్పారు. స్థానిక తలారిసింగి కేంద్రీకృత ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన రాజన్న బడిబాట కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంపీ మాధవి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజన బాలలంతా చక్కగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్ మాట్లాడుతూ, రాజన్న బడిబాట కార్యక్రమాన్ని వినూత్నంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. పాఠశాల విద్యను ముందుకు తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని, ఉపాధ్యాయులు బాధ్యతతో పని చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాజన్న బడిబాట కార్యక్రమంలో నిర్దేశించిన అంశాలను కచ్చితంగా అమలు చేసి సర్కారు లక్ష్యాన్ని అధిగమించాలని ఆయన ఆదేశించారు. పాఠశాలల్లో చేరే నూతన విద్యార్థులను ఆప్యాయంగా ఆహ్వానించాలని, పాఠశాలలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలలను ప్రకృతితో మమేకం చేసి వారిలో నూతన ఉత్తేజాన్ని తీసుకురావాలని ఆయన అన్నారు. అన్నీ పాఠశాలలో రాజన్న బడిబాట కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని వినయ్‌చంద్ కోరారు. అనంతరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పలువురు గిరిజన విద్యార్థులను శాలువాలు కప్పి సత్కరించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాలలకు బూట్లు, పుస్తకాలు, యూనిఫామ్‌లు వంటివి పంపిణీ చేశారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అభివాదం చేశారు.

ఈ కార్యక్రమంలో పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డి.కె. బాలాజీ, సబ్‌కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ప్రాథమిక విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు, జిల్లా విద్యా శాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి తిరుపతి రావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. విజయ్ కుమార్, ఏజెన్సీ విద్యా శాఖ అధికారి జ్యోతిర్మయి, పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పండుగలు సాంప్రదాయాలకు ప్రతీక

### ఘనంగా ముగిసిన పైడిమాంబ పండుగ మహోత్సవాలు .. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





విశాఖపట్నం : గ్రామదేవతల పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకని పలువురు ప్రముఖులు కొనియాడారు. గ్రామాల్లో ప్రజలను రక్షించే బాధ్యత గ్రామదేవతలే స్వీకరిస్తూ వచ్చారని, వీరంతా అన్నారు. సింహాచలం శ్రీ వరాహాలక్ష్మి నృసింహస్వామి సోదరి, అడవివరంతో పాటు ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ మహోత్సవాలు 9 రోజుల తరువాత బుధవారం తెల్లవారుజామున అత్యంత ఘనంగా ముగిసాయి. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు నేతృత్వంలో ఇక్కడ గోశాల వద్ద కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్నేహాంజలి సంస్థ నిర్వహించిన సినీసంగీత విభావరితో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారు అత్యంత మహిమాన్వితులు అన్నారు. ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పుగా అమ్మవారు నిత్యం పూజలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు ఎం.వి.వి. సత్యనారాయణ, డాక్టర్ కె. వెంకట సత్యవతిలు మాట్లాడుతూ క్రమం తప్పకుండా పైడితల్లి అమ్మవారి పండుగను భారీస్థాయిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. శాసనసభ్యులు గుడివాడ అమర్‌నాథ్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సిబిఐ మాజీ జాయింట్ డైరక్టర్, వి.వి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తాను ఈ అమ్మవారి పండుగకు హాజరుకావడం ఇదే తొలిసారి అని, ఇంత పెద్దఎత్తున ప్రజలంతా కలిసి పండుగ నిర్వహించుకోవడం అత్యంత ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తైనాల విజయ్‌కుమార్, వై.యస్.ఆర్. సిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, బి.జె.పి. నగర అధ్యక్షులు ఎం. నాగేంద్రతో పాటు కార్మిక నాయకులు ఎం. ఆనందరావు, గడసాల అప్పారావు, బత్తుల చిరంజీవి, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, సెంచురీయన్ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్. రాజు, సీనియర్ పాత్రికేయులు వి.వి. రమణమూర్తి, డిఎస్పీ వివేకానంద, ఎసిబి సి.ఐ. కె. లక్ష్మణమూర్తి, ఎ.పి. టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకటేశ్వరరావు, దేవస్థానం ఎ.ఇ.ఓ. పి. రాంబాబు, ఇ.ఇ. వెంకటరమణ, సంఘ సేవకులు కందుల నాగరాజు, మాజీ కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, కొల్లాబత్తుల వెంగళరావు, పైడా ముత్యాలనాయుడు, ఆళ్ల శ్రీనివాసరావు, గరికిన గౌరి, జి.వి.యం.సి. కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు టి. వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి గొంపా చంద్రమౌళితో పాటు పలువురు ప్రముఖులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖులను, కళాకారులను గంట్ల శ్రీనుబాబు దంపతులు ఘనంగా సన్మానించారు.





# కమల దళపతి ఎవరో?



దిల్లీ: భాజపా నూతన జాతీయ అధ్యక్షుడి ఎంపికకు కసరత్తు ప్రారంభమైంది. నేటి ఉదయం 11గంటలకు భాజపా కీలక సమావేశం జరగనుంది. భేటీ తర్వాత నూతన అధ్యక్షుడి ఎంపికకు షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. 2018 డిసెంబర్‌లోనే జాతీయ అధ్యక్షుడిగా అమిత్ షా పదవీ కాలం ముగిసింది. అప్పటికే సార్వత్రిక ఎన్నికల సమయం ఆసన్నమైన తరుణంలో కొత్త అధ్యక్షుడి ఎన్నికకు వెళ్లడం కొంత ఇబ్బందికరమని భావించిన పార్టీ అధిష్ఠానం.. అమిత్‌షాను మరికొంత కాలం కొనసాగించాలని నిర్ణయించింది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగియడం.. దేశంలో భాజపా విజయ ఢంకా మోగించడం.. మోదీ నేతృత్వంలో వరుసగా రెండోసారి కొత్త సర్కార్ కొలువుదీరడం.. మంత్రివర్గం ఏర్పాటు.. కేబినెట్‌లో అమిత్ షా హోంమంత్రిగా కీలక బాధ్యతలు చేపట్టిన తరుణంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎవరిని ఎంపిక చేయాలి? ఏయే అంశాలను ప్రాతిపదికలు తీసుకోవాలనే దానిపై భాజపా అధిష్ఠానం పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 11గంటలకు భేటీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా.. పదాధికారులు, పార్టీ ముఖ్య నేతలతో భేటీ కాబోతున్నారు.

ఈ భేటీలో అధ్యక్ష పదవికి సంబంధించి ప్రధానంగా ఎవరెవరు రేసులో ఉన్నారనే అంశంపై స్పష్టత రానుంది. దాంతో పాటు కొత్త అధ్యక్షుడి ఎంపిక ఎప్పుడు ఉండబోతోంది? నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలకు సంబంధించి షెడ్యూల్‌ను సైతం రేపు విడుదల చేసే అవకాశం కనబడుతోంది. ఎన్నికలు ముగిసిన వెంటనే పలువురు నేతల పేర్లు బయటకు వచ్చినప్పటికీ కొంతమందిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవడంతో అవన్నీ పక్కకుపోయాయి. ప్రస్తుతం మంత్రి పదవి రాని భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి జేపీ నడ్డా పేరు పరిశీలనలో ఉంది. మరోవైపు, ధర్మేంద్ర ప్రధాన్ పేరు సైతం ముందుకొచ్చినప్పటికీ.. ఆయనకు కేబినెట్‌లో చోటుదక్కడంతో ఆ పేరును పరిశీలనలోకి తీసుకొనే అవకాశం లేనట్టు పార్టీ వర్గాలు సంకేతాలిస్తున్నాయి. భాజపా ప్రధాన కార్యదర్శులుగా ఉన్న రాంమాధవ్, మురళీధర్ రావుల పేర్లు విన్పిస్తున్నప్పటికీ.. వారికి అధ్యక్ష స్థాయి ఇవ్వడానికి ఇంకా మరికొంత సమయం ఉందనే వాదనలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి పేరును ప్రకటిస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది. పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది గనక ఎట్టి పరిస్థితుల్లో వీలైనంత త్వరగా ఎంపిక ప్రక్రియ పూర్తిచేసేందుకు అమిత్ షా పూనుకున్నారు. ఈ నెల 17 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ సమావేశాలు ముగిసే లోపే భాజపా కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ పూర్తిచేయడం.. అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం జరిగిపోతుందని భాజపా వర్గాలు పేర్కొంటున్నాయి.

# బాబుకు ఆ విషయం ఎవరు చెప్పారు? : మంత్రి అనిల్

అమరావతి: అధికారంలో ఉండగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గజినీలా వ్యవహరించారని మంత్రి అనిల్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఇక్కడ మాట్లాడిన ఆయన.. ప్రాజెక్టులు ఆపేస్తున్నామని చంద్రబాబుకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు ద్వారా పారదర్శకంగా టెండర్లు నిర్వహిస్తామని చెప్పామని మంత్రి గుర్తుచేశారు. ఎన్నికల కోసం ఉన్న డబ్బంతా చంద్రబాబు వాడేశారని మంత్రి ఆరోపించారు.






# ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు

### వృద్దులకు దుప్పట్లు, స్వీట్లు, పంపిణి .. ఆయురారోగ్యాలు కలగాలని హోమం





భీమునిపట్నం: భీమిలి మండలం నేరెళ్ల వలస గ్రామంలో సద్గురు సాయి మందిర్ వృద్ధాశ్రమంలో ఎన్ ఎస్ ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్క ృతిక, యువజన సంక్షేమ శాఖ మంత్రి అవంతీ గ్రూప్ చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆశ్రమంలో అవంతీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచారు. అలాగే వంద మంది వృద్దులకు దుప్పట్లు, స్వీట్లు, పంపిణి చేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు అవంతీ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎన్ వి గణేష్, డైరెక్టర్లు డాక్టర్ ఎ చంద్రశేఖర్, ఎస్.రాఘవరావు, వైస్ ప్రిన్సిపల్ అర్జున్, వైసిపి నాయుకులు బోర శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆయురారోగ్యాలు కలగాలని హోమం**

భీమిలి మండలం మంగమారిపేట దగ్గర ఉన్న రామాద్రిలో బుధవారం పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టినరోజు పురస్కరించుకొని వైసిపి సినియర్ నాయుకులు నాగోతి సింగన్న హోమం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అవంతీ శ్రీనివాసరావుకి ఆయురారోగ్యాలు కలగాలని అలాగే మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సింగన్న దంపతులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com